బాలానంద

బొమ్మల పంచతంత్రం
[మొదటి భాగము]

రచన :
పురాణపండ రంగనాథ్

నవరత్న బుక్ సెంటర్
ఏలూరు రోడ్, విజయవాడ - 2.

బాలానంద

బొమ్మల పంచతంత్రం-1

రచన :

పురాణపండ రంగనాథ్

ప్రథమ ముద్రణ :

జనవరి-1999

ముఖచిత్రం, లోపలి బొమ్మలు :

వి. యస్. ప్రకాష్

ప్రచురణ హక్కులు :

బి. కె. ఆర్ మూర్తి

విజయవాడ-2.

ఫోన్ : 432813

ముద్రణ :

శ్రీరామా ప్రింటర్స్

విజయవాడ-2.

వెల : రు. 25-00

విషయసూచిక

1 పరిచయం
2 మిత్రలాభం
3 హిరణ్యకుడు
4 చిత్రాంగుడు
5 దురాశ పనికిరాదు
6 పేరాశ ప్రాణాంతకం
7 ఎవరూ అమాయకులు కారు
8 జిత్తులమారి నక్క
9 గుణమా? కులమా?
10 మిత్రభేదం
11 కోతిచేష్టలు
12 ఆషాడభూతి
13 ఉపాయం కథలు
14 కాకి తెలివి
15 ఉపాయంలో అపాయం
16 వెర్రి కొంగలు
17 లౌక్యం తెలియని ఒంటె
18 దుష్టబుద్ధి
19 మూర్ఖులు
20 మూడు చేపలు
21 భయం మంచిదికాదు
22 డిండిమము
23 పెద్దవారితో స్నేహం
24 వడ్రంగి సింహం
25 తాను తీసిన గోతిలో
26 భలే జంతువులు

పరిచయం

పంచతంత్రం కథలు వినగానే మనకు రకరకాల జంతువులు, పక్షులు, వాటి యెత్తులు, పై యెత్తులు గెలుపు ఓటములు గుర్తుకువస్తాయి. ప్రధాన కథతో బాటు యెన్నో నీతుల్ని చెప్పే పిట్టకథలు కనిపిస్తా. గర్జించే సింహాలు మాట్లాడతాయి. గాండ్రించే పులులు పలుకుతాయి. కువకువలాడే పావురాయిలు, కిచకిచలాడే కోతులు సంభాషిస్తాయి. ఎద్దులు, గ్రద్దలు, ఎలుకలు, జింకలు – ఒకటేమిటి మనకు పరిచయం ఉన్న అన్నిరకాల జంతువులు, పక్షులు పరస్పరం మాట్లాడుకొంటాయి ఒక్కొక్కమాట ఒక్కొక్క నీతికికోట. ఒక్కొక్కకథ ఒక్కొక్క జీవిత సత్యానికి సాక్ష్యం. పైగా జంతువులు, పక్షులు మాట్లాడడం అంటే సరదాగా వుంటుంది. అందుకే పంచతంత్రం దేశ దేశాల పాఠకుల్ని ఆకర్షించింది. తరతరాల బాలబాలికల్ని అది ఆకట్టుకొంది. ఎన్నో భాషలలోనికి అనువదించబడింది. ఎందరెందరో ఆ కథల్ని వ్రాశారు, వ్రాస్తున్నారు.



సుదర్శన మహారాజుగారికి మగపిల్లలున్నారు. కాని వారికిని లోకజ్ఞానం లేదు. వారికి సులభంగా విద్యాబుద్ధులు నేర్పి ఇంగిత జ్ఞానాన్ని ఇవ్వగల పండితుని కై అన్వేషించిన రాజుగారికి తమ పాటలీపుత్ర నగరంలోనే విష్ణుశర్మ అనే ఉత్తమ బ్రాహ్మడున్నాడని తెలిసింది. ఆయనకు కబురు పెట్టాడు. తన పిల్లల సంగతి చెప్పాడు. వారికి తక్కువకాలంలో లోకజ్ఞానం తెలిసేలా చేయమన్నాడు.

విష్ణుశర్మ "అలాగే" అని ఆ బాలకుల్ని తీసుకువెళ్ళాడు. వారికి చిన్న చిన్న కథలద్వారా లోకజ్ఞానాన్ని, రాజనీతిని బోధించాలనుకున్నాడు వారుకూడా కథలపట్ల ఆసక్తి చూపారు. విష్ణుశర్మ చెప్పిన నీతికథలు అన్నింటినీ కలిపి "పంచ తంత్రం" అంటారు.

"పంచ" అంటే ఐదు అని. "తంత్రం" అంటే "ఉపాయం" అని అర్థం. మనిషికాని, రాజుకాని తన జీవితంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా ఈ అయిదు రకాల ఉపాయాలతో గట్టెక్కవచ్చునని విష్ణుశర్మ వారికి ఉపదేశించాడు. ఆ ఉపాయాలు 1. మిత్రలాభం. 2. మిత్రభేదం 3. విగ్రహం 4. సంధి 5. లబ్దనాశం.

ఈ ఐదు ఉపాయాలలో మొదటి నాలుగు ప్రకరణాల కథలు బాగా ప్రచారం పొందాయి. మిత్రలాభం, మిత్రభేదం కథల్ని చిన్నయసూరి ఆనాటి తెలుగు వచనంలో అందంగా వ్రాశాడు. "విగ్రహం, సంధి" ప్రకరణాలను వీరేశలింగం పంతులుగారు వ్రాశారు లబ్దనాశం కథల్ని చెరకువాడ వేంకటరామయ్యగారు రచించారు. ఇవన్నీ భాషాపరంగా పిల్లలకు అందుబాటులో లేనివి. అంతేకాక ప్రధాన

కథలోంచి చిన్నకథలు బీరపాదులా అల్లుకుపోయి వుంటాయి. కనుక గుర్తుంచు కోవడం కష్టం.

బాలబాలికలకు సులభంగా ఈ కథల్ని చెప్పాలని ఈ ప్రయత్నం. మూల పంచతంత్రం వలెకాక ఏ కథకాథగా వీటిని చదువుకుందాం. ఆ కథ చెప్పే నీతిని



చివరవాక్యంలో తెలుసుకొందాం. "పంచతంత్రం"లో మొదటితంత్రం "మిత్రలాభం" మంచి స్నేహితులవల్ల లాభాలు చెడు స్నేహితులవల్ల కష్టాల గురించి యీ కథలు తేటతెల్లం చేస్తాయి. ఇది పంచతంత్రం గురించి పరిచయం. ఇక కథల ప్రపంచంలో ప్రవేశిద్దాం.



హిరణ్యకుడు

హిరణ్యకుడను ఒక ఎలుక చాలా తెలివైనది, మంచిది. ఎటువంటి అవమానాన్ని భరించలేదు, తనవారెవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే సహాయంచేసే ఉపకార గుణం ఉన్న మంచి ఎలుక అది.

ఒక నగరంలోని మఠంలో దాని కాపురం. అక్కడ సాధువులు ఎక్కువగా వుండేవారు. వారిలో చూడాకర్ణుడు అనే సాధువు ఒకడు. అతను మఠంలోని తన గదిలో ఒక చిలకకొయ్యకు తాడుకట్టి దానికి తన జోలి తగిలించేవాడు. ఆజోలెలో బియ్యం వగైరా వుండేవి.

అతని గది ప్రక్కనే నేలలో హిరణ్యకుడు పెద్ద కన్నంచేసి కాపురం వుంటుండేది. చూడాకర్ణుడి జోలిలో వదిలివేసిన బియ్యాన్ని, ఇతర రకాలైన ఆహార దినుసుల్ని, కూరగాయల్ని రహస్యంగా దొంగిలించి తన కలుగులోదాచేది. ఈ రకంగా ఆ ఎలుక బోలెడు ధాన్యాన్ని ఆహార దినుసుల్ని నిలవ చేసింది. దాని జాతి వారిలో అదే గొప్పది.

అయితే చూడాకర్ణుడు ఒకనాడు ఎలుక సంగతి పసిగట్టాడు. తానుదాచుకొన్న వాటినన్నిటిని దొంగిలిస్తున్న ఎలుకల్ని నాశనం చేయాలని నిశ్చయించాడు. మరునాడు గునపం తెచ్చి ఎలుక కన్నము తవ్వించాడు. కనిపించిన ఎలుకనల్లా

చంపించాడు. తెలివైన హిరణ్యకుడుమాత్రం తప్పించుకుంది. ఆ మఠంలోనే మరొక చోట మకాం పెట్టాలనుకొన్నది. కాని అనుమానం వచ్చినచోట, అవమానం జరిగిన చోట ఉండరాదని అక్కడనుంచి వెళ్ళిపోవాలనుకుంది.



పట్టణాలలో అయితే ఎక్కడ ఉన్నప్పటికీ ఇటువంటి అనుమానాలు తప్పవని, అరణ్యములో అయితే అక్కడ దొరికిన పళ్ళు ఫలాలు తిని హాయిగా బ్రతకవచ్చునని ఆలోచించి హిరణ్యకుడు అడవిలోకి వెళ్ళిపోయింది.

అడవిలో దానికి మంథరుడు అనే తాబేలు, లఘుపతనకుడు అనే కాకి స్నేహితులయ్యారు. మూడూ ఎంతో స్నేహంగా ఉంటున్నాయి. ఈ హిరణ్యకునకు చిత్రగ్రీవుడు అనే ఒక పావురం కూడా స్నేహితుడు.

ఒకసారి అడవిలో వేటగాడు నూకలు చల్లి వలపన్ని దూరంగా పోయి దాక్కొని చూస్తున్నాడు. అదే సమయంలో అటువైపుగా ఆకాశంలో ఎగురుతూ పావురాళ్ళ గుంపు వచ్చింది. భూమిమీద నూకలుచూసి తినాలనుకున్నాయి. ఆ పావురాళ్ళలో చిత్రగ్రీవుడు ఉన్నాడు.



"అడవిలో నూకలు రావడము విచిత్రంగా ఉంది. ఇది యెవరో వేటగాని పన్నాగం. మనం దిగవద్దు" అని చిత్రగ్రీవుడు అడ్డు చెప్పాడు. అయినా ఒక ముసలి పావురం మాటలు విని పావురాళ్ళు నేలమీద నూకలకోసం వాలాయి. వాలీ వాలగానే వాటి కాళ్ళు వలలో చిక్కుకున్నాయి. గింజుకొంటున్నకొద్దీ చిక్కు

పడిపోతున్నాయి! దూరంగా వేటగాడు రావడం కనిపించింది. తమకు చావు తప్ప దని అవి దిగులుపడ్డాయి.

అప్పుడు చిత్రగ్రీవుడు "మిత్రులారా! ఇప్పుడు విచారించి లాభంలేదు. మనం అందరం ఒకేసారి పైకి ఎగిరిపోదాం. నాకు హిరణ్యకుడు అనే మిత్రుడు

న్నాడు. అతని దగ్గరకు వెళ్ళితే వలకొరికి మనల్ని విడిపిస్తాడు" అని ఉపాయం చెప్పాడు.

చిత్రగ్రీవుని సలహా ప్రకారం పావురాళ్ళన్నీ ఒకేసారి రివ్వున గాలిలో ఆకాశానికి ఎగిరాయి. వాటి కాళ్ళకు చిక్కున్న వలతో సహా అది ఆకాశంలోనికి ఎగిరిపోవడంతో వేటగాడు నిరాశ చెందాడు. ఎక్కడయినా నేలవాలక

పోతాయా పట్టుకోలేకపోతానా? అని రెండవసారి [illegible] పడ్డాడు.

చిత్రగ్రీవుడు మాట ప్రకారం [illegible] అయిన ఒక కన్నం దగ్గర వాలాడు. హిరణ్యకుడు [illegible]



చిత్రగ్రీవుడు "మిత్రమా! నేను చిత్రగ్రీవుణ్ని! ఆపదలో వున్నాను కాపాడు" అని పిలిచాడు.

చాలాకాలం తర్వాత మిత్రుడు వచ్చాడని, పైగా ఆపదలో ఉన్నాడని విని హిరణ్యకుడు వేగంగా కన్నంలోనుంచి బయటకు వచ్చాడు. తీరా చూస్తే

అక్కడ చిత్రగ్రీవునితోబాటు యెన్నో పావురాలు వలలో చిక్కుకొని గిలగిలలాడు తున్నాయి. సూక్ష్మగ్రాహి అయిన హిరణ్యకునకు సంగతి అర్థం అయింది.

వెంటనే పదునైన తనపళ్ళతో ఆ వల త్రాళ్ళు కొరికాడు. చిక్కులు విప్పాడు. పావురాళ్ళు వలనుండి బయటపడ్డాయి. హిరణ్యకునకు కృతజ్ఞతలు



చెప్పాయి. కొన్నాళ్ళు అతడి దగ్గరేవుండి చిత్రగ్రీవునితో సహా పావురాళ్ళు ఎగిరి పోయాయి.

నీతి : ఆపదలో ఆదుకొన్నవాడే మంచి స్నేహితుడు.

చిత్రాంగుడు

పరోపకార బుద్ధిగల హిరణ్యకునికి మరో ఇద్దరు స్నేహితులున్నారని చెప్పుకున్నాం కదా! వారిలో ఒకరు కాకి. దాని పేరు లఘుపతనకుడు. మరొకరు తాబేలు. దానిపేరు మంథరుడు. అడవిలో వేరేచోట సరస్సులో ఉంటున్నాడు.



లఘుపతనకుడు హిరణ్యకుడు కలసి ఒకచోట ఉంటున్నారు. అయితే అక్కడ కరువువచ్చింది. ఆహారం దొరకడం లేదు. అందుకని హిరణ్యకుడు, లఘుపతనకుడు కలిసి మంథరుని దగ్గరకు వెళ్ళిపోయాయి.

అడవిలో ఆ ప్రాంతం బాగానే ఉంది. తాబేలుకు చెరువునిండా ఆహారం ఉంది. కాకికి ఆ చుట్టుప్రక్కల తిండి దొరుకుతుంది. ఎలుకకు లోటు లేకుండా

గడిచిపోతుంది. చెరువులో తాబేలు నివాసం. గట్టున చెట్టుపై కాకి ఇల్లు. చెట్టు మొదట కన్నంలో ఎలుక కాపురం.

ఆహారం సంపాదించడం, విందారగించడం కొంచెంసేపు విశ్రమించడం ఆ తర్వాత చెరువు ఒడ్డునచేరి సరదాగా మాట్లాడుకోవడం-ఆ ముగ్గురు స్నేహితుల రోజువారీ కార్యక్రమం అయింది. ఒకనాడు స్నేహితులు ముగ్గురూ కబుర్లాడుకొంటుండగా అటువైపు వేగంగా పరుగుపెడుతున్న ఒకలేడి వచ్చింది.

దాని రాక చూచి ఎలుక భయపడి పరుగునపోయి కన్నంలో దాగి తల పైకెత్తి చూడసాగింది. తాబేలు ఒక్క ఉదుటున నీటిలోకి దిగిపోయింది. కాకి కొమ్మపైకి ఎగిరి కూర్చుంది. లేడి భయంగా పరుగెడుతూ "రక్షించండి! రక్షించండి!" అని అరవసాగింది.

అప్పుడు హిరణ్యకుడు నెమ్మదిగా పైకి వచ్చి "ఏమి ఆపద వచ్చింది" అని అడిగింది. తనను వేటగాడు వెంబడించాడని తప్పించుకొని ఇటు వచ్చానని రక్షించమని లేడి కోరింది. హిరణ్యకుడు లేడితో మాట్లాడుతుండగా మంథరుడు, లఘుపతనకుడు కూడా అక్కడకు వచ్చారు. లేడికి వచ్చిన కష్టం గురించి తెలుసుకున్నారు. తమ దగ్గర ఉంటే ఎటువంటి భయం లేదని లేడిని వోదార్చాయి.



చిత్రాంగుడు, మంథరుడు, హిరణ్యకుడు, లఘుపతనకుడు ఎంతో స్నేహంగా వుంటున్నారు. ఏ పని చేసినా నలుగురు కలసి చేసేవారు. ఏ వింతను యెవరు చూసినా ఒకరికి ఒకరు చెప్పుకునేవారు. స్నేహం ఎంత తీయనైందో వారి జీవితాలు తెలిపాయి.

నీటిలోనూ, భూమిపైన తిరిగే విచిత్ర జీవి తాబేలు. గాలిలో ఎగురుతూ

అవసరం అయినప్పుడు భూమి మీదకు దిగే పక్షి కాకి. నీటిలో మునిగితే ప్రాణం పోతుంది. గాలిలో ఎగరలేదు. కేవలం భూమిమీద మాత్రమే చెంగుచెంగున గెంతుతూ జీవించే జంతువు లేడి. అలాగే ఎలుక. వీటికి కలిసినది స్నేహమే. వీటి మధ్య అవినా భావ సంబంధం బలపడటానికి కారణం మంచితనమే.

ఒకనాడు చిత్రాంగుడు పచ్చిక మేస్తోంది. ఆహారం తినివచ్చిన మంథరుడు, మేతమేసి వచ్చిన కాకి చిత్రాంగుడి జీవిత కథను అడిగాయి. ఇంతలో హిరణ్యకుడు వచ్చాడు. అప్పుడు ఆ లేడి తన కథను యిలా చెప్పింది.

నేను నా తల్లిదండ్రులతో బంధుమిత్రులతో ఒక అడవిలో ఉండేదాన్ని హాయిగా కాలం గడిచిపోతుంది. అప్పటికి నా వయస్సు ఆరు నెలలు. ఒకనాడు మందలోనుంచి తప్పిపోయాను. దారి మరిచిపోయాను. అడవి అంతా తిరిగాను ఫలితం లేకపోయింది.

ఇంతలో వేటగాడు అటు వచ్చాడు. తప్పించుకొనే మార్గంలేదు. ఎంతో తిరిగి అలసిపోయిన నేను ఎక్కువసేపు పరుగెత్తలేకపోయాను. వేటగాడికి చిక్కిపోయాను. వాడు నన్ను ఒక రాజుగారికి బహూకరించాడు.

రాచనగరంలో నాకు బాగానే వుండేది. మంచి పచ్చిక వేసేవారు. తియ్యటి నీళ్ళు పెట్టేవారు. శుభ్రంగా పన్నీటి స్నానం చేయించేవారు. అంతఃపుర స్త్రీలు నాతో ఆటలాడేవారు. వుద్యానవనంలో తిప్పేవాడు. రాజవీధిలో తిరిగినప్పుడు పిల్లలు నన్ను ముద్దాడేవారు. పచ్చిక వేసేవారు! కాలం హాయిగా గడిచిపోతోంది.

ఒకనాడు నన్ను రాజావారి భవనం బయట కట్టారు. ఆ రాత్రి వాన వచ్చింది. నాకు అడవి గుర్తుకి వచ్చింది! నా బంధువులందరూ గుర్తుకు వచ్చారు. "ఇలాంటి వర్షము వచినప్పుడు నా స్నేహితులతో వుంటే ఎంత బాగుండును" అని పైకి అన్నాను. ఆ మాటను రాజావారు విన్నారు! మనుషులు లేనిచోట ఈ మాటలు ఎలా వచ్చాయని చూశారు! అక్కడ నేను వున్నాను. ఆయన ఆశ్చర్యపోయాడు.

మరునాడు పండితుల్ని పిలిచారు. "మనుష్య భాష మాట్లాడే లేడివల్ల అరిష్టమా?" అని ఆయన వారిని అడిగాడు! "అలాంటి లేడి రాజనగరంలో వుండడం మంచిదికాదు కనుక వదిలివేయమని" వారు సలహా ఇచ్చారు.

ఆ ప్రకారం రాజుగారు నన్ను వదిలివేశారు. నేను వీధులన్నీ నగరాలు గ్రామాలు తిరిగి అడవిలోకి వచ్చాను. నా వాళ్ళ జాడ తెలియదు. అడవి గాలి

స్తూన్న నన్ను వేటగాడు వెంబడించాడు.! తప్పించుకొని తిరుగుతున్న నాకు మీ ఆశ్రమం దొరికింది.

చిత్రాంగుడి మాటలు విన్న అందరూ బాధపడ్డారు. అప్పుడు మంథరుడు ఇలా అన్నాడు.

"మనలో యెవరికి యెప్పుడు ఏ ఆపద వచ్చినా ఒకరికి ఒకరం సాయం చేసుకోవాలి! వుపాయంతో అపాయాన్ని తప్పించుకోవాలి.

అందరూ అంగీకరించారు. ఒకరోజున చిత్రాంగుడు అడవికి వెళ్ళి యెంత సేపటికి తిరిగిరాలేదు! మంథరుడు ఆందోళన చెందాడు. హిరణ్యకుడు బాధ



పడ్డాడు. లఘుపతనకుడు కంగారుపడ్డాడు. చాలాసేపు అవి చిత్రాంగుడి కోసం చూశాయి.

చివరకు లఘుపతనకుడు బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక అడవిలో వొకచోట చిత్రాంగుడు వలలో చిక్కుకొని వుండడం చూశాడు. వేటగాడు వల

పన్నాడని తాను చూచుకొనక దానిలో పడిపోయానని చిత్రాంగుడు మిత్రుడికి చెప్పాడు.

అప్పుడు లఘుపతనకుడు రివ్వున ఎగిరివెళ్ళి మంథరునకు హిరణ్యకునకు సంగతి చెప్పింది! మంథరుని సలహా ప్రకారం హిరణ్యకుని తన వీపున ఎక్కించుకుని చిత్రాంగుడు ఉన్నచోటుకు వచ్చింది. హిరణ్యకుని అక్కడదింపి ఇలా అంది.

"నీ పళ్ళతో వలను కొరుకుము. వేటగాడు వచ్చే లోపల మనం అందరం పారిపోవచ్చు."

మిత్రుని సూచన ప్రకారం హిరణ్యకుడు వలకొరికెను. చిత్రాంగుడు వల బంధమునుండి బయటపడి మిత్రులకు కృతజ్ఞతలు తెలిపెను. ముగ్గురు ఇంటికి

బయలుదేరిరి! ఇంతలో వారికి మంథరుడు ఎదురుపడెను. వారాశ్చర్యపడిరి అప్పుడు అతడిలా చెప్పాడు.

"మిత్రులారా! మిమ్మల్ని చూడాలనిపించింది. చిత్రాంగుడు పసివాడు ఆపదనుండి బయటపడి అతన్ని వెంటనే చూడాలని మనసు ఉవ్విళ్ళూరింది. అందుకే మీకు యెదురు రావచ్చునని వచ్చితిని."



మిత్రుని ఆత్రానికి, మంచి తనానికి అవి యెంతో ఆనందించాయి. నలుగురూ మాట్లాడుకొంటూ ఇంటిదారి పట్టారు. కొంతదూరం వెళ్ళేసరికి వారికి వేటగాడు యెదురుపడ్డాడు. అతడిని చూచి భయపడి కాకి చెట్టుపైకి ఎగిరి కొమ్మమీద

కూర్చుంది. ప్రక్కలో నున్న కన్నంలో దూరింది ఎలుక. లేడి చెంగున దూకి పారి పోయి పెద్ద చెట్టు చాటున దాక్కొని చూడసాగింది.

ఎటూ తప్పించుకోలేని తాబేలు మాత్రం వేటగానికి చిక్కింది, లేడి తప్పించుకుని పోయిందని బాధపడిన వేటగాడు చేజిక్కిన తాబేలును తాడుకు కట్టి బాణం కొనకు తగిలించి భుజాన వేసుకొని బయలుదేరెను.



వెనక్కు చూడకుండా వెళుతున్న వేటగాడ్ని ఎలుక, లేడి,కాకి, అనుస రించసాగాయి. తమ మిత్రుడు వేటగానికి దొరకడం పట్ల అవి యెంతో దుఃఖిం చాయి. ఎలాగయినా దానిని విడిపించుకోవాలని వాటి పట్టుదల. మూడూ ఉపాయం ఆలోచించాయి. ఒక ఎత్తువేశాయి.

ఆ ప్రకారం లేడి పరుగునవెళ్ళి వేటగానికి అల్లంతదూరాన చచ్చినట్లు పడుకుంది. కాకి దాని కొమ్ములపై కూర్చుని కన్ను పొడుస్తున్నట్లు నటించసాగింది. ఎలుకమాత్రం నెమ్మదిగా వేటగాని వెనుక నడవసాగింది.

ఎదురుగా చనిపోయిన లేడినిచూసి దానిని తీసుకువెళ్ళాలన్న తలంపుతో



వేటగాడు బాణాన్ని క్రిందపెట్టాడు. లేడి దగ్గరకు వెళ్ళాడు. ఈలోగా ఎలుక బాణానికి తాడు కొరికి తాబేలును విడిపించింది. తాబేలు గబగబా పాకి చెరువులోకి వెళ్ళిపోయింది. ఎలుక కన్నములో దూరింది. వేటగాడు దగ్గరకు రావడం చూచిన కాకి ఎగిరిపోయింది. లేడికూడా చెంగున లేచి పారిపోయింది. వేటగాడు అటు తాబేలుకోసం చూశాడు అదీ పారిపోయింది.

ఈరోజు తన ఖర్మం అలావుందని దిగులుపడి అతడు అడవి దారిన వెళ్ళి పోయాడు. వేటగాడు కనుమరుగై నాడని నిర్ధారించుకొన్న తర్వాత తాబేలు చెరువు లోంచి బయటకు వచ్చింది. కాకి చెట్టుకొమ్మ మీద నుండి దిగింది. ఎలుక కన్నం లోంచి వెలుపలకు వచ్చింది. దూరంగా పారిపోయిన లేడి కూడా నెమ్మదిగా మిత్రుల దగ్గరకు చేరింది.

మంథరుడు, లఘుపతనకుడు, చిత్రాంగుడు, హిరణ్యకుడు ఈ నలుగురూ మైత్రితో అపాయమునుండి రక్షించుకొన్నాయి. పరస్పరం సహాయం చేసుకొంటూ జీవితం గడిపాయి.

చూశారా బాలలూ! మంచి స్నేహితులుంటే ఎంతమేలు జరుగుతోందో

మరి! ఒకరికి ఒకరం సాయం చేసుకోవాలి. ఒకరితో ఒకరం మంచిగా ఉండాలి స్నేహితులకోసం ప్రాణాన్నయినా యివ్వడానికి సిద్ధంగా ఉండాలి. ఇది "మిత్ర లాభం" చెప్పే నీతి.

"మిత్రలాభం"లో ప్రధాన పాత్రలు హిరణ్యకుడు, లఘుపతనకుడు, మంధరుడు, చిత్రాంగుడు.

వీరి స్నేహబంధం కథ ఇంతవరకూ చదివాం. ఇక వీరు అప్పుడప్పుడు చెప్పుకొన్న మంచి నీతికథలు విడివిడిగా చదువుకొందాం. ఆ కథలన్నీ నీతి దాయకాలే.

దు రా శ ప ని కి రా దు

దురాశ పనికిరాదు. దురాశ దుఃఖానికి చేటు. అంతేకాదు వొక్కొక్కసారి ప్రాణాంతకం కూడా అని హెచ్చరించే కథ. ఈ కథలో వొక పెద్దపులి, బ్రాహ్మణుని ఎలా మోసగించి చంపిందో చిత్రగ్రీవుడు అనే పావురం తన స్నేహితులకు చెప్పింది.



చిత్రగ్రీవుడు ఎవరోకాదు. అడవిలో వేటగాడు నూకలుజల్లి వలపన్ని వెళ్ళాక వాటిని తినాలని నేలకు వాలిన పావురాళ్ళ స్నేహితుడు. ఆ కథ ఇంతకు ముందు చదువుకున్నాం. ఇప్పుడు దురాశ ఎంత చెడ్డదో తెలుసుకొందాం.

ఒక పెద్ద అరణ్యం ఉంది. ఆ అరణ్యంలో వొక పెద్దపులిఉంది. దానికి

మనిషి మాంసం అంటే మహాయిష్టం. ఐతే ఆ ఘోరారణ్యంలో మనుష్యులు ఎక్కడనుంచివస్తారు? అందుకని అది అడవిలోని జంతువుల్ని వేటాడి తినసాగింది. కొన్నాళ్ళు జరిగాయి. అయితే పులి కోరిక తీరలేదు. ఎప్పుడు మనిషికనబడతాడా చీల్చుకొని తిందామా? అని అది వేచి ఉంది.

ఒకనాడు ఆ అడవిమార్గాన పెద్ద బ్రాహ్మణుడు ఒకడు వచ్చాడు. పులి నోరూరింది. అతడిని ఎలాగయినా చంపి తినాలని ఆలోచించింది. దాని దగ్గర బంగారు కడియం ఒకటి ఉంది. ఆ కడియం చూపి బ్రాహ్మణుణ్ని దగ్గరకు పిలవాలని పులి ఎత్తు వేసింది. మామూలుగా పిలిస్తే పులి దగ్గరకు ఎవరు వస్తారు. అందుకని అది అక్కడ ఉన్న చెరువులో దిగింది.

మునిగిపోతున్నట్లు నటించి "రక్షించండి! రక్షించండి" అని ఏడుస్తూ

పేరాశ ప్రాణాంతకం

పేరాశ ప్రాణాంతకమని రుజువు పరచే మరొక కథ వుంది. ఒక అడవిలో ఒక నక్క ఉండేది. దానికి పేరాశ. అన్నీ తనకే కావాలని ఆశపడేది. కాని చిన్న జంతువు కావడంవల్ల దాని ఆశ తీరే అవకాశాలంతగా లేకపోయాయి.

సింహమో, పెద్దపులో వేటాడి తినగా మిగిలిన జంతువుల మాంసాన్ని తీరికగాతిని బ్రతుకు వెళ్ళబుచ్చుతోంది. ఐనా సమయం రాకపోతుందా? చక్కటి వేట దొరక్కపోతుందా? అని వేచి చూస్తున్నది. ఆ తరుణం రానే వచ్చింది.

ఒకనాడు ఒక వేటగాడు లేడిని భుజాన వేసుకొని వస్తున్నాడు!

అంతలో అతనికి అడవి పంది కనిపించింది. అది బాగా బలిసి వుంది. లేడిని ప్రక్కన పెట్టి గురిచూసి పందిపై బాణం వదిలాడు.

ఐతే బాణం కొంచెం గురితప్పి పందికి గాయమయింది తప్ప ఒక్క దెబ్బతో చావలేదు. బాణం దెబ్బతిన్న పంది కోపంతో వొక్కసారి గర్జించి వేట



గానిపై దూకి తన కోరలతో వాడి గుండెను బలంగా పొడిచింది. ఆ పోటుకు వేటగాడు చచ్చిపడిపోయాడు. కొద్దిసేపటికి పందికూడా గిలగిల తన్నుకుని చచ్చిపోయింది. దాని క్రిందపడి అక్కడే తిరుగుతున్న పాముకూడా దుర్మరణము చెందింది.

ఇదంతా పేరాశతో జీవిస్తున్న నక్క చూసింది. బలిసినలేడి, కండలు తిరిగిన పంది, పొడవైన జాతి పాము వొకేసారి ఇన్నిరకాల జంతువుల తాజామాంసం అయాచితంగా దొరకడంతో దానికి మతిపోయింది.

ఆ మూడు జంతువుల మాంసంలో ముందు దేన్ని రుచిచూడాలా అని ఆలోచిస్తుండగా దానికి వేటగాడి ప్రక్కన పడివున్న యెక్కుపెట్టిన బాణము కనిపించింది. ఆ బాణానికి నరంతో చేసిన తాడు కట్టారు. ఉప్పఉప్పగా వుండే ఆ నరాన్ని ముందుతిని తర్వాత మిగిలిన మాంసాలను తిందామనుకుంది.

వెంటనే అది నరాన్ని కొరికింది...అంతే, ఎక్కుపెట్టని బాణంకొమ్ము దాని నోట్లో దిగబడి నెత్తురు కక్కుకుని చచ్చిపోయింది. పేరాశవల్ల ఆలోచన మరచిపోయి నక్క ప్రాణాలు పోగొట్టుకుంది.

ఎవరూ అమాయకులు కారు

ఈ ప్రపంచంలో ఎవరూ అమాయకులు కారు. ఏ పనిని స్వలాభం లేకుండా చేయరు. కొందరు తెలివిగాచేసి పట్టుపడరు. కొందరు పైకి తేలిపోతారు. వారి స్వార్థం బట్టబయలవుతుంది. ఈ నీతిని చెప్పేకథ ఇది.

వర్థమానపురమనే ఊరుంది. ఆ ఊరిలో వొక బ్రాహ్మణుడు, భార్య వుంటున్నారు. వారు అంతగా సంపద వున్నవారుకాదు. బ్రాహ్మణుడు పౌరోహిత్యం చేసి బియ్యం, పప్పు, ఉప్పులు, నువ్వులు వంటివి తెచ్చేవాడు. దాంతో వారి సంసారం నడిచేది.

వొకసారి ఆ బ్రాహ్మణుడి యింట తండ్రిగారి తద్దినం వచ్చింది. ఇంటిలో నువ్వులుతప్ప ఏమి సంభారాలు లేవు. నువ్వు పప్పుతోనే పితృకార్యం చేద్దామని బ్రాహ్మడు భార్యకు పురమాయించాడు. ఆమె నువ్వులు నానవేసి దంచి, పొట్టుతీసి కడిగి పప్పు ఆరవేసింది.

అంతలో అటుగా వొకటి రెండు కోళ్ళువచ్చి పప్పు తినసాగాయి. ఆ సమయంలో బ్రాహ్మణుడు ఇంటికి వచ్చాడు. కోళ్ళు పప్పుతినడం చూశాడు. పక్షి ముట్టి ఎంగిలిచేసిన ఆ సరుకు పుణ్యకార్యానికి పనికిరాదని భార్యను మందలించాడు

ఆ పప్పు ఎవరికైనా యిచ్చివేసి, అందుకు బదులుగా నువ్వులు తీసుకు వచ్చి మరల పప్పు చేయమని ఆజ్ఞాపించాడు! ఆ యిల్లాలు నువ్వుపప్పు తీసుకుని వొకటి రెండు యిళ్ళు తిరిగింది.

కాని పని జరగలేదు. వొకరు నువ్వులులేవన్నారు. మరొకరు నువ్వుపప్పు ఉందన్నారు. పరులయింట చేసి తెచ్చిన పప్పు మడికి పనికిరాదు కదా! అందుకని ఆ యిల్లాలు మరొక యింటికి వెళ్ళింది.



ఆ యింటివాకిలిలో నువ్వులున్నాయి. పైగా ఆ యింటావిడ అమాయకు రాలని ప్రతీతి. అక్కడ తన పని సులభంగా నెరవేరుతుందని ఆమె అనుకుని లోపలికి వెళ్ళి వచ్చినపని చెప్పింది. ఆ ఇంటామె నువ్వు పప్పు సులభంగా వస్తున్నది కదాని సంతోషించి ఆ పప్పు తీసుకుని నువ్వులు ఇచ్చి పంపింది.

ఇంతలో ఆమె భర్తవచ్చి సంగతి తెలుసుకున్నాడు. తన భార్య అమాయకత్వానికి బాధపడ్డాడు. ఆమెకు జ్ఞాన బోధ చేయాలని ఇలా అన్నాడు.

"పిచ్చిదానా! నువ్వులు నానవేసి తెక్కలు ముక్కలు అమేలా దంచి పొట్టుతీసి ఆరబెట్టి ఛాయమినపప్పును నీకు అప్పసంగా ఇచ్చి, బాగుచేయని నువ్వుల్ని ఎవరయినా ఎందుకు తీసుకువెళతారే! ఆ నువ్వుపప్పులో ఏదో దోషం ఉంటుంది.



ఇకముందు యిలాంటి పిచ్చిపనులు చేయకు, ఏ లోపం లేకుండా ఈ ప్రపంచంలో ఎవ్వరు మేలైన సరుకు ఇచ్చి నాసిరకం పదార్థం తీసుకు వెళ్ళరు."

ఆమెకు భర్తమాటలు అర్థం అయ్యాయో, లేదోకాని ఈ కథలోని నీతి లోకానికి వెలుగు చూపింది.

జిత్తులమారి నక్క

ఇతరులను మోసం చేయాలని ప్రయత్నించినా, దానికి కష్టాలు కలిగిం లని పన్నాగాలు పన్నినా అది మనకే ముప్పు తెస్తుందని ఒక్కొక్కసారి ప్రాక లకు ముప్పు తెస్తుందని హెచ్చరించే కథ యిది. ఈ కథను హిరణ్యకుడు తనత స్నేహం చేయాలని వచ్చిన లఘుపతనకుడికి చెప్పాడు.

కొత్తవారిని గుణదోషాలను గుర్తించక దగ్గరకు చేరదీయరాదని, చేర దీ ప్రమాదం అని కూడా హిరణ్యకుడు ఈ కథద్వారా తెలియజెప్పాడు.

పూర్వం మగధ దేశంలో మందారవతి అనే అరణ్యం వుండేది. అక్క ఒక లేడి, కాకి స్నేహంగా వుంటున్నాయి.

అవి ఎంతో స్నేహంగా జీవిస్తున్నాయి. ఏ తోటలోనైనా మొక్కజొన్న కండెలు దొరికితే లేడి తెచ్చి కాకికి ఇచ్చేది. ఏ గ్రామంలో అయినా మంచి మిఠ యిలు లభిస్తే కాకి జాగ్రత్తగా తెచ్చి లేడికి పెట్టేది ఇలా అవి రెండు కష్ట సుఖాలి పంచుకొని అన్యోన్యంగా వుంటున్నాయి.

మంచి పచ్చిక, పిల్లి పెసర, రొట్టెవంటి గ్రాసం దొరుకుతూండడంతో అ మేసిన లేడి బాగా బలిసింది. వొళ్ళంతా కండలు పట్టి నిగనిగలాడుతోంది. ఒకనాటి అది పచ్చిక మేస్తుండగా ఒక నక్క దానిని చూసింది బాగా బలిసిన ఆ లే మాంసం తినాలని దానికి కోరిక కలిగింది. అందుకని ఒక ఎత్తు వేసింది.

మరునాడు అదేచోట మేతమేస్తున్న లేడి దగ్గరకు నక్క వచ్చింది. దాని చూసి లేడి "ఎవరు నువ్వు? ఇక్కడకు వచ్చావేం?" అని అడిగింది.

అప్పుడు నక్క ఇలా అంది.

"ఈ అడివిలో ఆ మూల ఉండేదాన్ని, అక్కడ క్రూర జంతువుల బా పెరిగింది కనక అక్కడ వుండడం క్షేమంకాదని యిటు వచ్చాను ఇక్కడ నువ్వు కనిపించావు. పైగా ఈ ప్రాంతంలో దుష్ట జంతువులు లేవు. ఇక్కడ వుండడ మంచిది కద! నీతో చెలిమి చేస్తాను ఉండనిస్తావా?"

నక్క మాటలు నమ్మింది లేడి. ఆపదతో వుండి శరణువేడి స్నేహంకోరి వచ్చిన తోడి జంతువులను ఆదరించడం ధర్మం అనుకొని నక్కతో ఇలా అంది.

"నక్కబావా నాకు ఒక కాకి స్నేహితుడున్నాడు. మేమిద్దరం కలసిమెలసి వుంటున్నాము నువ్వుకూడా మాతో కలిసి వుండవచ్చు రా! మా ఇంటికి వెళదాం."



లేడి మాటలకు నక్క ఆనందించింది. ఇద్దరూ కలిసి కాకి దగ్గరకువచ్చారు కాకి సంగతి అడిగింది. అప్పుడు లేడి తమ కొత్త స్నేహితుడు నక్క గురించి చెప్పింది. దానిపై కాకి ఇలా అంది.

"ఇది క్రూర జంతువుల జాతికి చెందినది. పైగా జిత్తులమారి, దీనితో స్నేహం మనకు పనికిరాదు."

అందుకు లేడి ఇలా సమాధానం చెప్పింది : మిత్రమా వేరేవేరే జాతులకు చెందిన మనం స్నేహం చేస్తున్నాం కద! అలాగే ఇదీను. జాతికన్న గుణం మిన్న ఇది మంచిదని నా ఉద్దేశ్యం మనతో వుండనిమ్ము."

మిత్రుని మాట కాదనలేక కాకి అంగీకరించింది. ఆ రోజునుంచి లేడి, కాకి, నక్క స్నేహంగా వుంటున్నాయి. నక్క సమయం చూసి లేడిని చంపి మాంసం తినాలని ఆలోచిస్తుంది. ఒక ఉపాయం ఆలోచించింది ఒకనాడు తీరికగా వున్న లేడి దగ్గరకు వచ్చి "మిత్రమా ఆ ప్రక్క చక్కటి పచ్చిక వున్నది రేపు అటువైపు వెళదాం" అంది. లేడి సరేనంది.

మరునాడు ఇద్దరూ ఆవైపు వెళ్ళారు. అక్కడ పచ్చికయేకాక జొన్నచేను కూడా వుంది. లేడి మహాయిష్టంగా జొన్నకండెలు - ఆకులు తినసాగింది. రోజూ అక్కడికే వచ్చి మేత మేస్తున్నది.

రోజూ చేలోపడి ఏదో జంతువు నాశనం చేస్తున్నదని ఆ పంటచేను రైతు వలపన్నాడు. మరునాడు యధాప్రకారం లేడి మేతకు వచ్చింది. అటు ఇటు తిరిగి పచ్చిక, జొన్న మొక్కలు తింటూ వలలో చిక్కుపడిపోయింది.

తప్పించుకోలేకపోయింది. నక్క తన ఎత్తుపారిందని సంతోషిస్తూ జొన్న తోట పక్కన దాగొని చూడసాగింది.

సాయంకాలం కావస్తోంది. తన మిత్రుడు గూటికి రాకపోవడంతో కాకి ఆందోళనపడింది. ఏదైనా ఆపదలో చిక్కుకొన్నదేమోనని ఆలోచించి వెదక సాగింది, ఎగురుతూ అడవి గాలిస్తున్న కాకికి జొన్న చేను దగ్గర వలతో బిగుసుకు పోయిన తన మిత్రుడు లేడి కనిపించినది.

తన మిత్రుని విడిపించాలని ఆలోచించినది. దానికి ఒక ఉపాయం తట్టినది రివ్వున వచ్చి మిత్రుడిదగ్గర వాలింది. లేడి కాకిని చూచి ఆనందించింది అప్పుడు కాకి "మరి నక్క నిన్ను కాపాడలేదా?" అని అడిగింది. దానికి లేడి ఇలాచెప్పింది.
"నేను వలలో పడడం దానికి ఆనందం అయింది. నా మాంసం తినాలనే

ఆలోచనలో వుంది. అందుకే వలకొరికి నన్ను విడిపించమని అడిగినా అది సాయం చేయలేదు. పైగా ఇవాళ ఆదివారం నరాలతో చేసిన వలను ముట్టుకోను నేను మాంసం తినడం లేదుకదా అని వెళ్ళిపోయింది. రైతు వచ్చి నన్ను చంపితే మాంసం తినవచ్చని ఇక్కడే ఎక్కడో దాగొని వుంటుంది.



లేడి మాటలు ఎంతో బాధతో చెప్పింది. అప్పుడు కాకి "నక్క జిత్తుల మారి, దొంగ బుద్ధిని ఇప్పటికైనా తెలుసుకొన్నావు అంతే చాలు, నేను నిన్ను రక్షిస్తాను" అంది.

లేడి ఆనందించింది. ఇంతలో భుజాన కర్రతో రైతు రావడం కనిపించింది. అప్పుడు కాకి "మిత్రమా! నువ్వు ఊపిరి బిగపట్టి చచ్చిపోయినట్లు పడి

ఉండు నేను నీ కళ్లు పొడుస్తున్నట్లు నటిస్తాను. రైతు నిజంగా నువ్వు చచ్చిపోయావని భ్రమపడి వలను తీసివేస్తాడు. పూర్తిగా తీసివేయగానే "కావ్! కావ్!" అని రెండుసార్లు అరుస్తాను. వెంటనే నువ్వు పారిపో" అని ఉపాయం చెప్పింది.

లేడి కళ్ళు మూసుకుని ఊపిరి బిగబట్టి కాళ్ళు తన్ని పెట్టినట్లు పండుకుంది! రైతువచ్చి లేడి చచ్చిపోయిందని అనుకొని వలతీసి ప్రక్కన పారవేయబోతుండగా

కాకి రెండుసార్లు "కావ్!కావ్!" అని అరచింది అంతే లేడి చెంగున పరిగెత్తింది.

వెనుతిరిగి చూసిన రైతు లేడి పారిపోతుండటం కనిపెట్టి కర్ర విసిరాడు! అది గురితప్పి గిరగిర తిరుగుతూ వెళ్ళి జొన్నచేను ప్రక్కన దాగివున్న నక్కకు తగిలింది. అది దెబ్బకు చచ్చింది!

"పొరుగువాణ్ని గోతిలో వేయాలంటే మనమే గోతిలో పడతాం" అనుకొంటూ నక్క మరణించింది. కాకి ఎగిరి వెళ్ళి మిత్రుడు లేడిని కలుసుకొంది.

మిత్రుడు చేసిన సహాయానికి లేడి ఎంతో మెచ్చుకుంది. అప్పుడు కాకి "మిత్రమా! కొత్తవారిని నమ్మి ప్రాణాలు పోగొట్టుకున్న గ్రద్దకథ చెబుతా" విను అంది లేడి వింటానంది.

గుణమా? కులమా?

లోకంలో ఒకరికొకరు మొదట కొత్తవారుగానే వుంటారు. క్రమంగా పరస్పర స్నేహమేర్పడుతుంది. అయితే ఎవరినైజం వారికి వుంటుంది. అది సమయం వచ్చినప్పుడు బయటపడుతుంది.

ఒక అవసరం కోసం అబద్ధం ఆడి, మంచితనం నటించినప్పటికీ కాల క్రమంలో చెడ్డతనం వ్యక్తం అవుతుంది. ఇది లోకసహజం. అందుకని ఆ సహజ గుణాలనుబట్టి కులాలు ఏర్పడ్డాయి. నక్క, పిల్లి వంటివి జిత్తులమారి లక్షణాలున్న దుష్ట జంతువులు, నక్క కథ ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఇప్పుడు దుష్టబుద్ధి అయిన పిల్లి కథ చదువుదాం.

గంగానదీ తీరంలో ఒక పెద్ద జువ్విచెట్టు ఉండేది. దానిపై ఎన్నో రకాల పక్షులు గూళ్ళు కట్టుకొని కాపురం ఉంటున్నాయి. ఆ చెట్టు తొర్రలో ఒక ముసలి గ్రద్ద కూడా వుంది. దాని పేరు జరద్గవము. అది గ్రుడ్డిది. వేటాడి ఆహారం సంపాదించుకోలేకపోయేది. అందుకని దాన్ని చూసి జాలిపడి పక్షులన్నీ తాము సంపాదించిన ఆహారంలో దానికి పెట్టేవి. అలా అది కాలం గడుపుతున్నది.

ఒకనాడు పక్షులన్నీ ఆహార సంపాదనకు వెళ్ళిపోయాక ఆ చెట్టు పైకి పిల్లి ఒకటి వచ్చింది. దాని పేరు దీర్ఘ కర్ణుడు అది బహు జిత్తులమారి.

ఎవరో చెట్టు ఎక్కుతున్న అలికిడివిని గ్రుడ్డి గద్ద "ఎవరదీ?" అని గద్దించింది. అప్పుడు పిల్లి "నాపేరు దీర్ఘ కర్ణుడను పిల్లిని" అంది. దానిపైగద్ద "ఇటురాకు వచ్చావంటే ప్రాణాలు తీస్తాను" అని హెచ్చరించింది అప్పుడు పిల్లి ఇలా అంది.

"గౌరవించదగిన ఓ గద్దా! నువ్వు పెద్దదానివి. ఎన్నో సంగతులు తెలిసిన దానివి. తొందరపడి నన్ను పొమ్మనకు. నేను పిల్లిజాతి దాన్నే అయినప్పటికీ మాంసం తినని శాఖాహారిని. పుణ్యం సంపాదించాలని జీవిస్తున్నాను. నీవంటి పెద్దల వద్ద పొద్దుపుచ్చాలని వచ్చాను. నన్ను ఆశీర్వదించి వుండనియ్యి.



వినయంగా పిల్లి అన్న మాటలకు గ్రద్ద సంతోషించింది. ఆ చెట్టుపై ఇద్దరూ సత్కాలక్షేపం చేసేవారు. కొన్నాళ్ళు నమ్మకం కలిగించేటట్లు పిల్లి ప్రవర్తించింది. ఆ తరువాత అది చెట్టుమీద గూళ్ళలోని పసిపిల్లల్ని తిని, ఆ ఈకల్ని, ఎముకల్ని గ్రద్ద వుంటున్న తొర్రలో పడవేసి వెళ్ళిపోయేది. గ్రుడ్డి గద్దకు ఈ సంగతులేమి తెలియలేదు.

రోజురోజుకి తమ పిల్లలు మాయమైపోతుండడం చూసి పక్షులు ఎంతో బాధ పడ్డాయి. గద్దని అడిగాయి. తనకేమీ తెలియదని గ్రద్ద చెప్పింది.

అప్పుడు పక్షులు ఆ గ్రద్ద తొర్ర వెతికాయి. దానిలో ఈకలు, ఎముక ముక్కలు ఉండడం చూసి గ్రద్దపై కోపగించాయి. ఎంత చెప్పినా వినక అవన్నీ కలసి గ్రద్దను పొడిచి చంపాయి. పిల్లి గుణం తెలిసినా మోసపోయిన గ్రద్ద దాన్ని



నమ్మి ప్రాణాలు పోగొట్టుకుంది. కనుక కొత్తవారి దోషాలు బాగా తెలుసుకొని స్నేహం చెయ్యాలి.

"ఇవి పంచతంత్రంలోని మొదటిభాగం అయిన మిత్రలాభంలోని కథా విశేషాలు. మంచి మిత్రుల్ని సంపాదించుకోనడం ఎంత కష్టమో ఆ స్నేహాన్ని ఎక్కువకాలం నిలుపుకోవడం అంతే కష్టం. మంచి స్నేహితులవల్ల ఎప్పుడూ మేలే కలుగుతుంది"-అని విష్ణుశర్మ "మిత్రలాభం"లో వివరించాడు.



స్నేహితులమధ్య విరోధాన్ని కల్పించి వారిని విడదీయడాన్ని "మిత్ర భేదం" అంటారు. ఇద్దరు రాజులుకలసి బల పడకుండా చేయకుండా ఇద్దరు బల వంతులుఐకమత్యంగా వుండకుండా చూడడానికి ఈ "తంత్రం" ప్రయోగిస్తుంటారు.

ఈ కథాభాగంలో తారసపడే జంతువులు సంజీవకుడు. ఇది బలిసిన ఎద్దు. పింగళకుడు అడవికి రాజు యిది సింహం. కరటకుడు, దమనకుడు ఇవి నక్కలు పింగళకుని మంత్రికి కొడుకులు-పాటక, కాటకులు ఇవీ నక్కలే, ఇవి రాజుకు వ్యతిరేక వర్గంలోవున్న జంతువులు.

ప్రధాన కథ వీటిమధ్య జరుగుతుంది. ఆయా సందర్భాన్నిబట్టి మధ్య మధ్య నీతికథలు వస్తాయి. వాటిని తర్వాత చెప్పుకుందాం. ముందు అసలు కథ చెప్పుకుందాం.

మహిళాపురం అనే పట్టణం ఒకటి ఉండేది. అక్కడ వర్ధమానుడు అనే వ్యాపారి ఉండేవాడు. అతను ప్రక్కనగరాలకుపోయి వ్యాపారంచేసి యెక్కువ డబ్బు సంపాదించాలని ఆలోచించాడు. ఇరుగుపొరుగు నగరాలలో దొరకని ముత్యాలు, పగడాలు, కస్తూరి, పట్టుబట్టలు బండిపై వేసుకుని బయలుదేరాడు.

ఆ బండికి కట్టిన ఎడ్లపేరు సంజీవుడు, నందకుడు, అవి రెండూ మంచి యెడ్లు. చక్కగా వేగంగా నడుస్తాయి. బండి అడవి మార్గంలో ప్రయాణం చేస్తున్నది. యెత్తుపల్లాల బాటపై ఎడ్లు కష్టంగా లాగుతున్నాయి. ఒకచోట సంజీవకుడి కాలు మడతపడి బెణికింది. కుప్పలా కూలిపోయి నడవలేకపోయాడు.

యిక ఆ ఎద్దుతో బండి నడవదని వర్ధమానుడు మరొకఎద్దును తెప్పించి బండికి కట్టుకుని ప్రయాణమై వెళ్ళిపోయాడు.

అది నెమ్మదిగా కుంటుకుంటూ పడుతూ లేస్తూ అడవిలో తిరిగింది. నాలుగు రోజులు అలా బెణుకు నొప్పితో బాధపడిన తర్వాత దానికి ఆ నొప్పి తగ్గింది. క్రమంగా ఆరోగ్యం బాగుపడింది.



ఒకనాడది అడవిలో తిరుగుతూ, ఒకచోటకువచ్చి అడవిదద్దరిల్లిపోయేలా రంకె వేసింది.

అదే సమయంలో అక్కడకు సమీపంలోని చెరువులో నీళ్ళుత్రాగటానికి వచ్చిన ఆ అడవిరాజు పింగళకుడు అనే సింహం రంకె విని భయపడింది.

అడవిలో బలంగల తననే భయపెడుతున్న ఆ శబ్దం ఎవరు చేశారు

వారెంత బలవంతులో? వారివల్ల తన పదవికి భంగంలేదుకదా! తనకన్నా బలవంతులు అడవిలో ఎవరు? వారివల్ల తన సామ్రాజ్యానికి ఎటువంటి ప్రమాదం లేదు కదా!"

ఇలా ఆలోచిస్తూ దిక్కులుచూస్తున్న పింగళకుని దగ్గరకు మంత్రి కొడుకులయిన కరటకుడు, దమనకుడు వచ్చారు. అప్పుడు దమనికుడు "రాజా! మీరలా



భయపడుతున్నారేమి? ఆ రంకెవేసినవారెవరో తెలుసుకొనివస్తాను. అతడు బలవంతుడై ధైర్యశాలి అయితే మనతో స్నేహం చేయిస్తాను. అటువంటి వారి మైత్రి రాజ్యానికిక్షేమం" అని పింగళకునకు ధైర్యంచెప్పి ఆ రంకెవినవచ్చినవైపువెళ్లాడు.

అక్కడ సంజీవకుడుబలంగా కాలిగిట్టలతో నేలనుతవ్వుతూ పౌరుషంగా

రంకెవేస్తున్నాడు. దమనుడు నెమ్మదిగా ఆ ఎద్దు దగ్గరకు వెళ్ళాడు. వినయంగా ఇలా పొగిడాడు.

"ఈశ్వరుడి వాహనం అయిన నందీశ్వరునివంటి రూపురేఖలు, పరాక్రమంగల ఓ వృషణరాజమా! నమస్కారం! నీ పౌరుషం నిన్నుచూస్తేనే తెలుస్తుంది నేను పింగళక మహారాజువారి ప్రతినిధిని. ఆయనే ఈ అడవికి రాజు,



ఆయన మీవంటి పరాక్రమవంతుల స్నేహాన్ని కోరుతున్నారు. మీరు నా వెంటవస్తే వారి వద్దకు తీసుకువెళతాను.

దమనకుడి మాటలువిన్న సంజీవకుడు ఆలోచించాడు. అనామకంగా ఆ అడవిలో తిరుగుతూ, ఏ సింహానికో, ఎర అయిపోవడంకన్నా రాజదర్బారులో చేరి, చక్రవర్తికి స్నేహితుడిగా వుండటం మంచిదని అనుకున్న సంజీవకుడు "అలాగే" దమనకుడి వెంట వెళ్ళాడు.

దమనకుడు, సంజీవకుని పేరు, పౌరుషవివరాలు పింగళకునికి చెప్పాడు. పింగళకుడు సంతోషించాడు. వారిద్దరికీ దమనకుడు స్నేహం నెరపాడు.

ఈ రోజు నుంచీ సంజీవకుడు, పింగళకుడు మంచి స్నేహంతో మెలగ సాగారు. ఏ సమస్య వచ్చినా సింహంరాజావారు సంజీవకుని సలహా అడిగేవారు. ఆ

ఎద్దు చక్కటి సలహా ఇచ్చేది దానితో ఆ గండం గడిచేది. ఇలా సంజీవకుడు రాజు గారి విశ్వాసాన్ని అభిమానాన్ని పొందాడు.

ఒక శుభముహూర్తాన సంజీవకుడ్ని ప్రధానమంత్రిగా నియమించాడు పింగళకుడు. వారి స్నేహాన్ని చూసి ఈర్ష్యపడిన కరకట, దమనకులకు సంజీవకుడు ప్రధానమంత్రి కావడం పుండుమీద కారం చల్లినట్లయింది.

తమకు దక్కవలసిన ప్రధానమంత్రి పదవిని ఆ ఎద్దు కైవసం చేసుకోవడం పట్ల అవి బాగా అసూయపడ్డాయి, కోపగించాయి. ఎలాగయినా సంజీవక పింగళకుల మధ్య విరోధం కల్పించి వాటిని విడదీయాలని ఆ ఇద్దరూ ఆలోచించారు.

సంజీవకునిపై పితూరీలు పింగళకునికి చెప్పేరు. పింగళకుని దౌష్ట్యం గురించి సంజీవకునికి చెప్పేవారు. ఇలా ఒకరిపై ఒకరికి పగ ద్వేషం కలిగించేవారు.



ఒకనాడు పింగళకుని దగ్గిరకు వెళ్ళి దమనకుడు ఇలా అన్నాడు.

మహారాజా! సంజీవకుడు బలవంతుడు, పైగా తెలివయినవాడు. ఆపై అతనికి పదవీ, అధికారం వున్నాయి. అతడు ఏనాటికయినా మిమ్మల్ని ఓడించి రాజును కావాలని ఆలోచిస్తున్నాడు. ఈ మధ్య అతను మీ శత్రువర్గం వారైన

పాటక, కాటకులనే నక్కలతో స్నేహం చేశాడు. నా మాట విశ్వసించి అతడిని శిక్షించండి.

ఈ మాటలువిని అప్పటికే సంజీవకునిపై కోపంతోవున్న సింహం గర్జించింది. "నా ఉప్పుతిని, బలిసి, నేనిచ్చిన పదవితో పెద్దవాడైన సంజీవకుడు నాకే ఎసరు పెడతాడా? అతడిని చంపివేస్తాను" అని ప్రతిజ్ఞచేసి పింగళకుడు సంజీవకుని ఇంటివైపు గర్జిస్తూ పరుగు పెట్టాడు.



సరిగ్గా అదే సమయంలో అక్కడ సంజీవకునికి కరటకుడు దుర్బోధ చేశాడు.

"సంజీవకా! బలపరాక్రమవంతుడివి. ఈ అడవి రాజ్యం నీ వశం కావాలి కాని ప్రధానమంత్రి పదవి ఏమిటి? పైగా పింగళకుడు నీపై పగపట్టి ఉన్నాడు. పాటక, కాటకులతో తిరుగుతున్నావని అతనికి కోపం. అందుకని నిన్ను చంపేయా

లని చూస్తున్నాడు, ఇకనైనా జాగ్రత్తపడు. ఇవాళే ఆ పింగళకుని చంపి రాజ్యానికి చక్రవర్తివి కమ్ము."

ఈ మాటలు సంజీవకుని తలకు బాగా ఎక్కాయి. అది కోపంతో రంకె వేసింది. గిట్టలతో నేలను తవ్వింది. "పింగళకుని యివాళే చంపుతాను" అని అరచి తోక పైకెత్తి పరుగు పెట్టింది.



మార్గంలో పింగళకుడు రావడం చూసింది. అతడు సంజీవకుడ్ని చూశాడు. ఒకరిపై ఒకరు విరుచుకొని పడ్డారు. ఇద్దరు భయంకరంగా యుద్ధం చేశారు. పింగళకుడే ముందు కిందపడిపోయాడు. ఇంతలో సింహానికి మెలకువ వచ్చింది! అది లేస్తూనే ఒక్క ఎగురు ఎగిరి సంజీవకుణ్ణి చంపింది. ఇంతకాలం తనతోనే స్నేహంగా ఉన్న మిత్రుడు ప్రాణాలు విడవటంతో మొదట పింగళకుడు సంతోషించాడు.

కాని ఇదంతా కరటక దమనకుల కుట్ర వలన జరిగిందని తెలుసుకొని బాధపడ్డాడు.

తనవంటి రాజు సంజీవకుని వంటి పౌరుషవంతుని విషయమై చెప్పుడు మాటలు వినరాదని భావించాడు!

సమఉజ్జీవులైన స్నేహితులమధ్య విరోధం కల్పించే గుంటనక్కలు ఉంటాయని వారి చెప్పుడు మాటలు వినరాదని ఈ కథ నీతి చెపుతుంది.

ఇది మిత్రభేదం ప్రధాన కథ. ఈ కథలో అంతర్భాగంగా కొన్ని చిన్న నీతి కథలున్నాయి! వాటిని విడివిడిగా చెప్పుకుందాము.

కోతి చేష్టలు

కోతి చేష్టలంటే అక్కరలేని, మనకు కాని పనులు చేయడమని అర్థం. అలా చేయడంవలన యితరులకు హాని జరగవచ్చు! మనకూ హాని జరగవచ్చును. అందుకే తనకు మాలిన ధర్మం, మొదలుచెడ్డ బేరమేనన్నారు పెద్దలు.

ఒక అడవి వుంది. ఆ అడవిలో బోలెడు కలపవుంది. ఒక వ్యాపారి ఆ కలపను పోగుచేయించి, వడ్రంగులచేత చెక్కలు, బల్లలు, కమ్మెలు చేయిస్తున్నాడు. ఒక చెట్టుక్రింద నీడలోవడ్రంగి, తన పనివారిచేత పని చేయిస్తున్నాడు. ఆ చెట్టుపై చాలా కోతులున్నాయి. ఒక కోతి పనివాళ్ళు చేస్తున్న వడ్రంగంపనులు చూస్తుండిపోయింది.

పనివాళ్లు ఆ మానును సగంకోసి, అది చీలినచోట కలసిపోకుండా శీలలు కొట్టారు. ఇంతలో సాయంత్రం అయింది. పనివాళ్ళు ఇళ్ళకు వెళ్ళిపోయినారు. వాళ్ళు అలా వెళ్ళగా చూసి కోతులు కొమ్మలు దిగి వచ్చి అక్కడ కలప దుంగల మీదా చెక్కలమీదా యిష్టం వచ్చినట్లు ఆడసాగాయి.

ఉదయంనుంచి వడ్రంగం పనిని తదేకంగా చూస్తున్న కోతి మాత్రం



పనివారు సగంకోసి వదలిన చెక్కమీదకు ఎక్కింది. ఒక కాలును కోసిన చీలిక వద్ద లోపలకు వేసింది. రెండవ కాలును బయటకు వేలాడేసింది. కాసేపు అటు యిటు జారింది. ఆ చీలిక దగ్గర కొట్టినశీల బయటకు లాగసాగింది.

కొంతసేపు అటుయిటు గుంజేసరికి ఆ శీల ఊడి వచ్చింది. అడ్డు తొలగి పోవడంతో చీలివున్న చెక్కభాగం దగ్గరగా వచ్చింది. ఆ సందున వున్న కోతికాలు

నలిగిపోయింది. కాలును బయటకు లాగాలని కోతి నానా యాతన పడింది. కాని కాలు ఊడిరాలేదు సరికదా అది ఆ బాధకు తట్టుకోలేక చచ్చిపోయింది.



తనకుమాలిన పని చేయడం ప్రాణాంతకం అని "కోతి చేష్టలు" కథ చెప్పే నీతి, ఈ కథను కరటకుడు దమనకుడికి చెప్పాడు.

ఆ షా ఢ భూ తి

పూర్వం దేవశర్మ అనే సన్యాసి ఉండేవాడు. అతడు చక్కటి వక్త. బాగా చదువుకొన్నాడు. గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు వేదాంతా విషయాలు బోధిస్తుండే వాడు భక్తుల గాథలు వినిపిస్తుండేవాడు. పురాణ పురుషుల చరిత్రలు చెబుతుండే వాడు.

భక్తులు ఆయనకు సేవలుచేసి పళ్లు, ఫలాలు దక్షిణ తాంబూలాలు యిస్తుండే వారు. అతను ప్రసాదాలు పంచిపెట్టి తాను కొన్ని ఫలాలు సేవించి, డబ్బును మాత్రం దాస్తుండేవాడు. అలా కొన్ని రోజులు గడిచేసరికి అతని దగ్గర చాలా వెండినాణేలు చేరాయి. వాటిని అతడు ఒక బొంతలోవేసి కుట్టి దాచాడు. అతడి దగ్గర అంత డబ్బు ఉంటుందని ఎవరూ ఊహించరు.

కాని ఆషాడభూతి అనే యువకుడుఈ సంగతి కనిపెట్టాడు. ఎలాగైనా ఆ డబ్బు కాజేయాలను ఆలోచించాడు. అతడి దగ్గర శిష్యునిగాజేరి నమ్మకం కలిగించి ఆ బొంతను అపహరించుకుపోవాలని ఎత్తువేశాడు.

ఒకనాడు దేవశర్మ భక్తుల్ని పంపివేసి ఒంటరిగా వున్నాడు. ఆ సమ

యంలో ఆషాఢభూతి అతనికి దగ్గిరకు వచ్చాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. దేవశర్మ అతని వివరం అడిగాడు. అప్పుడు ఆషాఢభూతి ఇలా అన్నాడు.

"మహానుభావా! నా పేరు ఆషాఢభూతి. నేను ఈ సంసారంపై ఆసక్తి లేనివాడిని మీ సేవ చేసుకొంటూ తరించాలని వచ్చాను."

అతడి వినయానికి శ్రద్ధకు సంతోషించి దేవశర్మ అతన్ని శిష్యునిగా

అంగీకరించాడు. నాటినుంచి ఆషాఢభూతి గురువును అన్నివిధాల కనిపెట్టుకుని ఉండి సేవ చేస్తున్నాడు.

ఒకనాడిద్దరూ ప్రయాణమై మరొక గ్రామానికి వెళుతున్నారు. కొంత దూరం వెళ్ళాక ఆషాఢభూతి "గురువుగారూ! ఘోరం జరిగిపోయింది. నిన్నరాత్రి నిద్రించిన వారియింటి చీపురపుల్ల నా సంచికి అంటుకొని వచ్చింది. పరులసొమ్ము

పూచికపుల్లయినా తీసుకొనుట పాపం కనుక నేను ఇప్పుడే పదిఅంగలలో వెళ్ళి ఆ పూచికపుల్లను ఇచ్చి వచ్చేస్తాను. మీరు నడుస్తుండండి." అని కొంత దూరం వెనుకకు వెళ్ళి ఆ పూచికపుల్లలు ప్రక్కనపారవేసి వేగంగా మరలవచ్చి గురువు గారిని కలుసుకొన్నాడు. అప్పుడు గురువుగారు "నాయనా! పరద్రవ్యాపేక్ష ఏమాత్రంలేని నువ్వు నాకు శిష్యుడవు కావడం నా అదృష్టం" అని అతడిని పొగిడాడు. ప్రయాణం సాగింది.

గ్రామాలు తిరిగారు, తీర్థాలు సేవించారు. పట్టణాలు ప్రయాణించారు. ఒక రోజున యిద్దరూ అడవిమార్గంలో నడిచి వెళుతున్నారు. ఇంతలో సాయంకాలమైంది. సంధ్యావందనం చేసుకొనే నిమిత్తం గురువుగారు తనబొంతను, ఇతర సామాగ్రిని ఆషాడభూతికి యిచ్చి చెరువులో దిగాడు.

అదే సమయమని ఆషాడభూతి బొంతతో పారిపోయాడు. గురువుగట్టు మీదకు వచ్చిచూస్తే అక్కడ మిగిలిన సామాను వుంది. కానిడబ్బు దాచిన బొంతతో శిష్యుడు పరారయ్యాడు. ఎంత అరచి గీపెట్టినా, యెంత గాలించినా శిష్యుని జాడ తెలియదు.

"ఆషాడభూతివంటి నమ్మకద్రోహులు వుంటారు జాగ్రత్త!" అని ఈ కథ హెచ్చరిస్తుంది. అంతేకాదు తానొకటితలిస్తే దైవం వేరొకటి తలుస్తాడని యీ కథ సారాంశం.

దీన్ని దమనకుడు కరటకునికి చెప్పాడు. అప్పుడే తెలిసింది. పింగళక సంజీవకుల మైత్రి పెరిగి చివరకు తనకు రావలసిన ప్రధానమంత్రి పదవి సంజీవకుడు వచ్చినప్పుడు "నేనొకటి తలిస్తే దైవం వేరొకటి తలచిం"దని దమనకుడు బాధపడి యీ కథను కరటకునికి చెప్పాడు.

ఉపాయం కథలు

ఆపదలు వచ్చినప్పుడు ఉపాయంతో వాటిని తప్పించుకోవాలి. అలాగే ఉపాయాన్ని ఆలోచించేటప్పుడు దానివల్ల మరొక అపాయంరాకుండా చూసుకోవా

లంటే అపాయానికి ఉపాయం ఎంత ముఖ్యమో వుపాయంతో అపాయంలేకుండా జాగ్రత్తపడడం అంతే ముఖ్యం. ఈ నీతిని చెప్పే కథలు కొన్ని చెప్పుకుందాం.

ఉపాయంతో ఎలాంటి అపాయాన్నైనా తప్పించుకోవచ్చు. తెలివి ఆలోచన సమయస్ఫూర్తి వుంటే చాలు శత్రువును ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించవచ్చు. అలా ఒక సింహాన్ని చంపిన చిన్న కుందేలు కథ ఇది.



ఒక అరణ్యం వుంది. అక్కడ యెన్నోరకాల జంతువులు నివసిస్తున్నాయి. వాటన్నిటికీ రాజు సింహం. అది చాలాబలమైనదీ పౌరుషంగలది. తన పంతం చెల్లాలనే పట్టుదలగలది. పైగా క్రూరమైంది. అందుచేత దానికి ఆడింది ఆట పాడింది పాటగా చెల్లిపోతుంది.

అది యిష్టము వచ్చినట్లు వేటాడి జంతువుల శవాల్ని పోగులు పెట్టేది. తిన్నంత మాంసం తిని మిగిలినదాన్ని అడవిలో చిందరవందరగా విసిరిపారేసేది. ఆ సింహం వేటకు బయలుదేరుతుందంటేచాలు అడవిలోని జంతువులన్నీ ప్రాణ రక్షణకోసం పరుగుపెట్టేవి.

సింహం యిష్టంవచ్చినట్లు మృగాల్ని చంపడంవల్ల తమ తమ జాతులు నశించిపోయే ప్రమాదం యేర్పడిందని అవి గుర్తించాయి. అందుకని అన్నీకలసి ఒక తీర్మానము చేశాయి. రోజుకు వొకరి వొంతున సింహానికి ఆహారంగా వెళ్ళాలి సింహంరాజుగా తమ యిష్టం వచ్చినట్లు యిక వేటాడటం మానివేయాలని ఆ తీర్మాన సారాశం.

ఆ సంగతినే సింహానికి తెలియజేశాయి· మృగరాజు అందుకంగీకరించింది అప్పటినుండి సింహం వేటకెళ్ళటం మానివేసింది. మృగాలు వంతులవారీగా తమ తమ కుటుంబాలనుంచి ఒక్కొక్కటి సింహానికి ఆహారంగా పంపిస్తున్నాయి. కష్టం లేకుండా నోటిదగ్గరకు ఆహారం వస్తుండడం దానికి బాగానే వుంది. జంతువులు తమవంతు ప్రకారం వేళదాటిపోకుండా మృగరాజు దగ్గరికి వెళుతున్నాయి.

ఒకనాడు చిన్న కుందేలు వంతైంది. మూడు సంవత్సరాలయినా నిండని తనకి అప్పుడే ఆయుర్దాయం చెల్లిపోయిందని అది చాలా బాధపడింది. అయితే అది మిగిలిన జంతువులవలెకాక తెలివైంది, ఆలోచించగలది. ఉపాయంతో తనకు దాపురించిన గండాన్ని తప్పించుకోవాలని అది యోచించసాగింది. దానికి ఉపాయం తట్టింది.

అన్ని జంతువులవలె కాక అది ఆలస్యంగా సింహం దగ్గరకు బయలుదేరింది. ఇక్కడ సింహం వేళదాటిపోతున్నప్పటికి తన ఆహారానికి జంతువు రాకపోవడంతో కోపంతో గర్జించసాగింది. యింతలో కుందేలు అక్కడకువచ్చి నిలిచింది. దానినిచూసి సింహం భయంకరంగా గర్జించి ఇంత ఆలస్యం అయినదేమి" అని అడిగింది. అప్పుడు కుందేలు వినయంగా, భయం నటిస్తూ ఇలా అంది.

"మహారాజా! నేను మామూలు వేళకే బయలుదేరాను. కాని దారిలో మరొక సింహము కనిపించినది, నన్ను నిలదీసి గద్దించినది. తానే అడవికి మహారాజును అన్నది. మరొకడు రాజు కాదన్నది. నన్ను తనకు ఆహారము కమ్మన్నది. నేను అతికష్టముమీద దానిని ఒప్పించి, మీ దర్శనము చేసుకొని తిరిగి వస్తానని చెప్పి ఇటు వచ్చాను.



"ప్రభూ! ఆ సింహం మిమ్మల్ని ఎంతగానో దూషించింది. మీకు పౌరుషం లేదన్నది. గాజులు వేసుకొన్న ఆడసింహం అని వెక్కిరించింది.

యీ మాటలు చెప్పి కుందేలు సింహంవైపు చూసింది. అప్పటికే ఆ మృగరాజు జూలు విదిలించి, బిగ్గరగా గర్జించి ఇలా అంది.

"ఎవడా ధూర్తుడు. ఈ అడవికి నేనే రాజును. వాడెవడో నిన్ను భయపెట్టాడు. పద! నాకు వాన్ని చూపించు. నా పంజాతో కొట్టి చంపేస్తాను."

ఈ మాటలు అని సింహము పరల గర్జించింది. ఆ పరాయి సింహం దగ్గరకు తీసుకు వెళ్ళమని తొందరజేసింది. అప్పుడు కుందేలు నెమ్మదిగా ముందుకు నడిచింది. సింహం అనుసరించింది.

వారిద్దరూ అలా నడిచి, ఒక పాడుబడిన నూతిదగ్గరకు వెళ్ళారు. సింహము అటు యిటు చూసినది. శత్రు సింహానికై అది వెదుకుతోందని కుందేలు పసి కట్టింది. ఇక జాగు చేయడం అనవసరం అని అది ఇలా చెప్పింది.

"మహారాజా! మిమ్మల్ని వెక్కిరించి, దూషించిన ఆ సింహం ఆ నూతిలో ఉంది వెళ్ళి చంపండి.

కుందేలు మాటలు విన్న సింహం వొక్కసారి కోపంతో గర్జించింది. వొక్క ఉదుటున ఆ నూతి గట్టుమీదకు దూకి లోపలకు చూసింది.

నూతిలో మరొక సింహము కనిపించింది. ఈ సింహము గర్జించింది. ఆ సింహము గర్జించింది. ఈ సింహము పంజాపైకెత్తింది. ఆ సింహము అనాగే చేసింది. తానేంచేస్తే అదే చేస్తున్న ఆ సింహము అంటే కోపం బాగా పెరిగింది. యిక జాగు చేయరాదని నూతి గట్టుమీదనుంచి ఈ సింహము నూతిలోకి ఉరికింది.

అంతే, నీటిలో మునిగి చచ్చిపోయింది. ఆ నూతి నీటిలో తన నీడపడి మరొక సింహమువలె కనిపించినదని కోపముతోవున్న అడవిరాజు పసిగట్టలేక పోయింది.

కుందేలు పన్నిన ఉపాయము వలలో చిక్కుకొని చచ్చిపోయింది.

చిన్నకుందేలు తెలివి ఉపయోగించి, ఉపాయముతో అపాయము నుంచి బయటపడి, ప్రాణాలు కాపాడుకుంది.

కాకి తెలివి

చక్కటి ఉపాయముతో తన కుటుంబాన్ని కాపాడుకొన్న కాకి కథ ఇప్పుడు చదువుదాము.

నర్మదా నదీతీరాన వొకచెట్టుపై కాకికుటుంబము నివసిస్తోంది. అది, భార్య పిల్లలు అక్కడ హాయిగా ఉంటున్నాయి. కాని ఆ చెట్టుక్రింద పాము పుట్ట ఒకటి వుంది. ఆ పుట్టలో పాము వుంది. కాకి దంపతులు అహారాన్వేషణకు వెళ్ళగానే ఆ పాము నెమ్మదిగా చెట్టుపైకి యెక్కి కాకిపెట్టే గుడ్లను తినివేస్తోంది. ఆ పాము



నుండి తమ గుడ్లను ఎలా కాపాడుకోవాలా అని అవి ఆలోచించాయి. వాటికి ఉపాయమేమీ తట్టలేదు.

చివరకు కాకి తన స్నేహితుడైన ఎలుకను ఉపాయము చెప్పమంది.

ఎలుక కూడా ఆలోచించి యేమీ చెప్పలేకపోయింది. చివరకు ఒక ఉపాయము తోచింది.

మరునాడు ఆ కాకి రాజుగారి అంతఃపురములోకి వెళ్ళింది. అక్కడ ఒక కొలనులో రాణిగారు, ఆమె స్నేహితురాళ్ళు స్నానాలు చేస్తున్నారు. వారు తమ ఆభరణాలు, బట్టలు గట్టున పెట్టారు. కాకి వారందరూ చూస్తుండగా ఒక ముత్యాల హారం ముక్కున కరచుకొని ఎగిరింది.



"కాకి ముత్యాలహారము ముక్కును పట్టుకొని ఎగురుతుంది పట్టుకోండి" అని రాణిగారు బయట కాపలాకాస్తున్న భటులకు ఆజ్ఞాపించారు. భటులు కాకిని అనుసరించసాగారు, ఆకాశములో కాకి ఎటు తిరిగితే, దాని వెంబడే భటులు నేలపై పరుగు పెడుతున్నారు.

కాకి ఎగిరి ఎగిరి వెళ్ళి తన గూడువున్న చెట్టుపై వాలి, అటు యిటు చూసింది. భటులు చెట్టుక్రింద నిలచి, పైకి చూస్తూ కాకిని అదలిస్తున్నారు.

అప్పుడు కాకి వొడుపుగా ఆ ముత్యాలహారాన్ని చెట్టు క్రింద పుట్టలోపడేటట్లు వదిలింది. ఆ హారము పుట్టలో పడిపోవడము చూసిన రాజభటులు పుట్టను తవ్వ సాగారు. కాంత త్రవ్వేసరికి పాము బయటకు వచ్చింది.

భటులు దానిని కర్రలతో బాది చంపారు. తర్వాత మరికొంత లోతు త్రవ్వగానే పుట్టలో ముత్యాలహారము కనిపించింది. భటులు దానిని తీసుకువెళ్ళి రాణిగారికి ఇచ్చారు.

కాకి తన కుటుంబానికి శత్రువైన పామును ఇలా అపాయం లేని ఉపాయంతో సులభంగా చంపగలిగింది. అందుచేత ఉపాయాన్ని మించిన తరుణోపాయం లేదు.

ఉపాయంలో అపాయం

ఉపాయాలన్నీ మంచివికావు. ఒక్కొక్కసారి ఉపాయమే అపాయంగా మారి ప్రాణాలు తీస్తుంది. అటువంటి కథలు చెప్పుకొందాం.

ఒక చెరువులో బోలెడు చేపలు ఉండేవి. ఎన్నోరకాల పీతలు, రొయ్యలు దానిలో కాపురం చేస్తున్నాయి. వాటిని హాయిగా భోజనం చేయాలని ఒక కొంగ ఆలోచించింది. చెరువులో మెడ పైకెత్తి చూడసాగింది. తమను వేటాడి తినే పక్షి వచ్చిందని భయంతో చేపలన్నీ దూరంగా పోయాయి. తను మెడ పైకెత్తినా అవి భయపడుతున్నాయని కొంగ పసిగట్టింది. ఈసారి మరొక ఎత్తు వేసింది. మెడను నీటిలో ముంచి, ఒక కాలు పైకెత్తి తపస్సు చేస్తున్నట్టు నిలబడింది. నాలుగైదు రోజులు అలాగే గడిచాయి. చేపలకు దాని వింత ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. దాని సంగతి తెలుసుకుందామని అవన్నీ దానిచుట్టూ చేరి తిరగసాగాయి. అయినా కొంగ వాటిలో ఒక్క చేపను పట్టుకోలేదు తపస్సు చేసుకుంటూనే ఉంది. అప్పుడు చేపలు కొంగతో యిలా అన్నాయి.

"ఓ కొంగా! రుచికరమైన ఆహారంగా పనికివచ్చే మేం దగ్గరకు వచ్చినా తినవేమి? నీ ప్రవర్తన వింతగా వుంది నీ వివరం చెప్పు."

అప్పుడు కొంగ వారితో యిలా అంది.

"ఓ చిరంజీవులారా! చిన్న చేపలారా! నేను భగవంతుడి గురించి తపస్సు చేస్తున్నాను. మాంసాహారం తినడంలేదు. అందుకే మీవంకయినా చూడడంలేదు."

కొంగ మాటలను చేపలు నమ్మాయి. ఆనాటినుంచి అవి కొంగ దగ్గర జేరి మంచి కథలు, కబుర్లు ఆడేవి. కొంగ వాటికి ఎన్నో సంగతులు చెప్పేది. వాటిని ఉత్సాహపరిచేది! తన మాటలు నమ్మేటట్లు మాట్లాడేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి!

ఒకనాడు కొంగ దిగాలుగా ఉండటం చూసి చేపలు కారణం ఏమని అడిగాయి. అప్పుడు కొంగ కన్నీరు కారుస్తూ ఇలా అంది.

"ప్రియమైన స్నేహితులారా! అమాయక చేపల్లారా! మీకు కష్టకాలం రానున్నది. ఈ చెరువులో నీటిని తోడివేస్తారట. నీళ్ళు లేనిదే మీరెలా జీవిస్తారు? నేను ఎక్కడికైనా పోగలను. ఇన్నాళ్ళూ నా బిడ్డల్లా చూసుకున్న మిమ్మల్ని ఎలా రక్షించను అని ఆలోచించాను. ఆ కొండవతల మంచి సరస్సు ఉంది. అక్కడకు మిమ్మల్ని చేరిస్తే మంచిదనిపించింది. తర్వాత మీ యిష్టం..."

కొంగ మాటలను చేపలు విశ్వసించాయి. తమను ఎలాగయినా రక్షించమన్నాయి. అప్పుడు కొంగ ఒకమాట చెప్పింది.

రోజూ ఒకరిద్దరిని నా ముక్కున కరచుకుని వెళ్ళి ఆ సరస్సులో విడిచి వస్తాను.



చేపలు అందుకు అంగీకరించాయి. మరునాటినుంచి కొంగ శక్తికొలది ఒకటి రెండు చేపల్ని ముక్కున పట్టుకుని కొండవైపుకు వెళ్ళి ఆపైన వాటిని చంపి తిని వస్తోంది. యిలా కొన్నాళ్ళు గడిచాయి.

తమ స్నేహితులందరూ సురక్షితంగా సరస్సులో ఉన్నారని కొంగ యిక్కడి చేపలకు చెబుతూండేది. అవి ఆ మాటలు నమ్మేవి.

ఒకనాడు ఎండ్రకాయ వంతు వచ్చింది! అది కొంచెం తెలివయినది. కొంగ ముక్కున కరుచుకుంటే ఎక్కడ తనను 'గుటకాయస్వాహా' చేస్తోందోనని దానికి అనుమానం వచ్చింది! అందుకని యిలా అంది. "కొంగ గురువుగారూ!" మీరు పెద్దలు, పుణ్యాత్ములు! మాంసాహారం ముట్టని సదాచారులు కదా! నేను కంపుకొడుతుంటాను. పైగా అల్పజీవిని. మీరు నన్ను నోటితో పట్టుకొనడం నాకు

యిష్టంకాదు. ఆ రకంగా మీ వ్రతాన్ని భగ్నపరచడం పాపం. కనుక నేను మీ మెడను నా కొండీలతో పట్టుకుంటాను ఎగిరిపోండి!"

ఎండ్రకాయ మాటలకు కొంగ పొంగిపోయింది. అది తనను పొగిడినందుకు ఆనందించింది. "అలాగే పట్టుకో" అని మెడ చాచింది. ఎండ్రకాయ కొంగ మెడను వొడుపుగా పట్టుకుంది. చేపమాంసం తిని మొహం మొత్తిన కొంగ ఎండ్రకాయ మాంసాన్ని తినవచ్చునన్న ఆశతో వేగంగా పైకి ఎగిరి కొండశిఖరం వైపు పయనించింది.



ఇక కొండశిఖరంమీద కొంగ దిగటానికి సిద్ధపడుతోంది. అప్పుడు ఎండ్రకాయ అటు యిటు చూసింది. అక్కడ సరస్సు ఏమీ కనిపించలేదు. పైగా కొండ మీద చేపల పొలుసులు, ఎముకలు కనిపించాయి.

ఇన్నాళ్లు కొంగచేసిన మోసం ఎండ్రకాయకు అర్థమయింది. తీపి మాటలు చెప్పి కొంగ చేపల్ని మోసగించి చంపి తిందని తననుకూడా భక్షిస్తుందని ఎండ్ర కాయ తలచింది.

ఇంతలో కొంగ కొండపైన వాలసాగింది. ఆలస్యంచేస్తే లాభంలేదని ఎండ్రకాయ తన కొండీలతో కొంగ మెడను బలంగా నొక్కి చంపింది.

కొంగప్రాణాలు కోల్పోయి కొండమీద పడింది. ఎండ్రకాయ నెమ్మదిగా కొండ దిగి చెరువు దగ్గరకు చరచర పారిపోయింది.

పాపం కొంగ చేపల్ని చంపడానికి ఆలోచించిన ఉపాయం చివరకు దానికే అపాయంగా పరిణమించింది. అందుచేత ఉపాయం ఆలోచించేటప్పుడు దానివల్ల కలిగే ప్రమాదాలు కూడా యోచించాలని ఈ కథ నీతి.

వెర్రికొంగలు

ఉపాయంవల్ల వచ్చే అపాయం గురించి ఆలోచించలేక కుటుంబమును పణంగా పెట్టిన వెర్రికొంగ కథ చెప్పుకుందాము.

ఒక అడవిలో ఒక చెట్టుపై కొంగ దంపతులు కాపురం వుంటున్నాయి. ఆ చెట్టు క్రింద పుట్టలో పాము వుంది. అది చెట్టు ఎక్కికొంగ గ్రుడ్లను, పిల్లల్ని

తినేసేది. తమ పిల్లల్ని రక్షించుకోవడం యెలాగాని ఆలోచించిన కొంగ ఒకయెత్తు వేసింది.

అక్కడి సమీపంలో ఒక ముంగిస వుంటున్నది. పామునకు ముంగిసకు విరోధం కదా పాముని చంపడానికి ముంగిసను ప్రయోగించాలని కొంగ ఆలోచించింది.



ఒకరోజున కొంగ చేపల్ని వేటాడి ముంగిస ఇంటి దగ్గరనుంచి పాము పుట్ట వరకూ వరుసగా వేసింది! తాను వెళ్ళి చెట్టుపై కూర్చుంది. ఇక్కడ ముంగిస ఇంటిలోనుంచి బయటకు వచ్చి చేపలు వరుసగా పడివుండటం చూసింది. మంచి ఆహారం దొరికినందుకు సంతోషించి ఒక్కొక్క చేపనేతింటూ పుట్టదగ్గరకి చేరింది.

సమయం చూసి చెట్టుపైన కూర్చున్న కొంగ తన నోటిలో మిగిల్చిన చేపను పుట్టలోకి జారవిడిచింది పుట్టలోవున్న పాము ఆ చేపను చూసి బుస్సుమని పుట్టపైకి వచ్చింది.

అక్కడేవున్న ముంగిస పామును చూడగానే "బుస్సు" మని మీదకి దూకింది. రెండూ కొద్దిసేపు పోరాడాయి. చివరకు ముంగిస పామును రెండు ముక్కలుగా కొరికి చంపేసింది. చెట్టుపై కూర్చున్న కొంగ తన శత్రువయిన పాము చచ్చిపోయిందని సంతోషించింది.



అయితే ముంగిస చెట్టుపైకి చూసింది. పైన గూళ్ళలో కొంగ గ్రుడ్లు పిల్లలు ఉండడం కనిపించింది. మంచి మాంసం దొరికిందని సంతోషించి ముంగిస చెట్టుపైకి యెక్కి గ్రుడ్లును, పిల్లల్ని తిని వెళ్ళిపోయింది.

శత్రువు మరణించాడన్న సంతోషం తమ పిల్లల్ని ఫణంగా పెట్టుకున్నా మన్న దుఃఖం వెర్రికొంగ దంపతులకు కలిగాయి. ఉపాయంలో దాగిన అపాయాన్ని కూడా గుర్తించాలని ఈ కథ చెప్పేనీతి.

లౌక్యం తెలియని ఒంటె

మంచితనము శ్రేయస్కరమే కాని లౌకికజ్ఞానంలేని మంచితనం మంచిది కాదు! పైగా దుష్టులతో చేరితే ఆ మంచితనమే ప్రాణాలు తీస్తుంది. సముద్రంలో కలిసిన నదీజలాలుకూడా ఉప్పగా మారిపోయిన విధంగా దుష్టబుద్ధి గలవారితో చేరితే మంచివారికి చేటు తప్పదు! ఈ నీతి చెప్పే కథ ఇది.

ఒక అడవిలో సింహంరాజు దగ్గర నక్క, కాకి, పులి పనిచేస్తుండేవి అవి మంచివికావు. కాని మంచితనాన్ని నటించేవి. ఒకనాడు అడవిలో బాగాబలిసిన ఒంటె ఒంటరిగా తిరుగుతూ కనిపించింది. అవి దాని దగ్గరకువచ్చి "నువ్వెక్కడి



దానవు? యిక్కడకు వచ్చావు?" అని ఆరా తీశాయి. అప్పుడు ఆ ఒంటె యిలా సమాధానం చెప్పింది.

"స్నేహితులారా! నేను ఈ ప్రక్క గ్రామం నుంచి వచ్చాను. మా యజమాని నన్ను నానా బాధలు పెడుతున్నాడు అనుభవించలేక ఇక్కడకు వచ్చి పడి

హేను రోజులయింది. ఆహారం బాగానే దొరుకుతుంది, కాని మంచి స్నేహితుల కోసం తిరుగుతున్నాను.

ఒంటె మాటలు విని నక్క, కాకి, పులి సంతోషించాయి. అది మంచిదని అవి దానితో స్నేహం చేయాలనుకున్నాయి. తమతో రమ్మని తీసుకువెళ్ళాయి. తమ రాజుగారిని దానికి పరిచయం చేశాయి. ఒంటె మంచితనాన్ని సింహం రాజావారు యెంతో మెచ్చుకున్నారు.

క్రమంగా వారిద్దరి స్నేహం పెరిగింది. సింహానికి ఒంటె తెలివితేటలపట్ల విశ్వాసం పెరిగినది. నమ్మకము కుదిరినది. దానిని రాజ్యానికి ప్రధానమంత్రిగా నియమించింది. ఇది పులికి, నక్కకు, కాకికి ఈర్ష్య కలిగించింది. ఇన్ని సంవత్సరాలుగా కొలువులో వున్న తమకు ఆ పదవి రాక కొత్తగా చేరిన ఒంటెకు ఆ గౌరవం దక్కడంవల్ల అవి అసూయ చెందాయి. ఎలాగయిన ఒంటెకు హాని చేయాలని ఆలోచించాయి. సమయము కోసము వేచి వున్నాయి.

ఒకసారి సింహానికి జబ్బుచేసి అది కదలలేని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు నక్క, కాకి, పులి జంతువుల్ని వేటాడితెచ్చి సింహానికి ఆహారంగా యిచ్చేవి. ఒక లాడు వాటికి వేట దొరకలేదు. యెంత తిరిగినా చిన్న జంతువుకూడా లభించలేదు అవి దిగాలుగా రాజుదగ్గరకు వచ్చాయి.

కాకి తనను తినమన్నది. అప్పుడు సింహము "నిన్ను తింటే నా ఆకలి తీరదు" అంది. అప్పుడు నక్క తనను భక్షించమన్నది. సింహము దానికి అదే సమాధానం చెప్పింది. అప్పుడు పులి తనను ఆహారంగా తినమని కోరింది. దానిపై సింహం "ఓ పులీ! నువ్వు యెందరో అమాయకులను చంపితిన్న పాపాత్ముడివి. నిన్ను నేను భక్షించను. ఇలా ఆకలితో మరణించినా ఫర్వాలేదు" అని దిగాలుగా చూసింది.

అప్పుడు ఒంటె రాజుగారి దగ్గరకు వచ్చి "మహాప్రభూ! నాది పెద్ద శరీరం. బోలెడు మాంసం ఉంటుంది, నన్ను తినండి" అని కోరింది. అందుకు సింహము అంగీకరించింది. వెంటనే పులి ఒంటెమీదకు దూకి చంపింది. సింహం ఆ మాంసాన్ని తిని ఆకలి తీర్చుకొన్నది.

పులి, నక్క, కాకి లౌక్యంతో ఈ పన్నాగం పన్నాయని తెలుసుకొనలేక ఒంటె మంచితనము వల్ల ప్రాణాలు పోగొట్టుకుంది. దుష్టులు మంచివారి ప్రాణాలను కూడా తీయడానికి వెనుకాడరని ఈ కథ నీతి.

దుష్టబుద్ధి

ఇతరులకు హాని తలపెడితే అది మనకే హాని అవుతుంది. అపాయము గురించి ఆలోచించక ఎత్తువేసిన అది వారికే చిత్తు చేస్తుంది. ఇందుకు దుష్టబుద్ధి కథే నిదర్శనము, ఆ కథ తెలుసుకొందాము :

పూర్వము ఒక గ్రామములో దుష్టబుద్ధి, సుబుద్ధి యిద్దరు మిత్రులు ఉండేవారు. దుష్టబుద్ధి అంటే చెడు ఆలోచన గలవాడని, సుబుద్ధి అంటే మంచి మనసు కలవాడని అర్థము. వారి పేర్లకు తగినట్లే వారి నడవడి ఉండేది.

ఒకసారి యిద్దరూ పొరుగున ఉన్న పట్టణానికి వర్తకానికై బయలు దేరారు. మార్గములో వారికి బంగారు నాణాలు వున్న అంటె బిందెలు దొరికాయి. వాటిని తీసుకొని యిద్దరూ వెనుదిరిగారు. ఆ ధనాన్ని సమానముగా పంచుకుందామని ఇద్దరూ నిశ్చయించుకున్నారు. అయితే పగటిపూట వాటిని వూరిలోనికి తీసుకెళ్ళడము యిష్టములేక వూరి చివర చెట్టుక్రింద పాతి, యిళ్ళకు చేరారు. తర్వాత

ఒకనాడు రాత్రివచ్చి ఇద్దరు ఆ ధనాన్ని తీసుకువెళ్ళవచ్చునని సంకల్పించుకొన్నారు. ఎవరి యిళ్ళకు వారు వెళ్ళిపోయారు.

అయితే దుష్టబుద్ధికి ఆశ పెరిగింది. ఆ బంగారు నాణాలను తానే తీసుకోవాలని అనుకున్నాడు. అందుకని ఆ రాత్రి చెట్టు దగ్గరకు రహస్యంగా వెళ్ళి బిందెలను తీసుకొని యింటిలో దాచుకొన్నాను. కొన్ని రోజులు గడిచాయి.



ఆ సంగతి తెలియక సుబుద్ధి ఒకనాటి రాత్రివచ్చి "మిత్రమా! ఆ చెట్టు క్రింద పాతిపెట్టిన బిందెలను తెచ్చుకుందాం రా" అన్నాడు. దుష్టబుద్ధి "సరే" అని మిత్రుని వెంట బయలుదేరాడు. ఇద్దరు చెట్టుక్రిందకు చేరి త్రవ్వారు. ఎంతత్రవ్వినా, ఎక్కడ త్రవ్వినా వారికి బిందెలు కనిపించలేదు. అప్పుడు దుష్టబుద్ధి సుబుద్ధిని యిలా నిందించాడు.

"మిత్రద్రోహి! ఇక్కడ నిధిని పాతి పెట్టినట్లు మనకిద్దరికి తప్ప పైవారికి

తెలీదు. నువ్వే రహస్యముగా వచ్చి బిందెలు తీసుకొనిపోయి వుంటావు. నీ దొంగ తనము బయటపడరాదని యిలా నాటకము ఆడుతున్నావు."

మిత్రునికి సుబుద్ధి ఎంత చెప్పినా వినలేదు. పైగా రెచ్చిపోయి దుర్భాష లాడాడు. నిందించాడు. అప్పుడు సుబుద్ధి విసిగి "నీ యిష్టము వచ్చినట్లు చేసుకో! దైవమే సాక్షి నేను యే పాపము యెరుగను" అని యింటికి వెళ్ళిపోయాడు.

తరువాత దుష్టబుద్ధి రాజుగారికి ఫిర్యాదు చేశాడు. రాజు ఇద్దరు చెప్పినది సావధానంగా విని సుబుద్ధే ఆ ధనాన్ని తీశాడని సాక్ష్యమేమిటి అని అడిగాడు. అప్పుడు దుష్టబుద్ధి "నిధిని పాతినచోట ఉన్న చెట్టే సాక్ష్యము చెపుతుంది రేపు విచా రించవచ్చు" అన్నాడు. రాజుగారు అందుకు సమ్మతించారు.

దుష్టబుద్ధి యింటికి వచ్చి ముసలి తండ్రిని పిలిచి రాజుగారి కొలువులో జరిగిన సంగతి వివరించి "తండ్రీ! నువ్వు ఆ చెట్టు తొర్రలో దాక్కొని రాజుగారు వచ్చి సాక్ష్యము అడిగినప్పుడు సుబుద్ధి ధనాన్ని అపహరించాడని చెప్పు" అని బోధ చేసి పంపాడు. ఆ ముసలాయన అలాగే అన్నాడు.

మరునాడు సుబుద్ధి, దుష్టబుద్ధి, రాజుగారు, కొందరు భటులు కలసి ఆ చెట్టు దగ్గరకు వెళ్ళారు. రాజు చెట్టునుచూసి "ధనమువున్న బిందెలున ఎవరు అపహ రించారో చెప్పు" అని ప్రశ్నించారు.

అంతర్కితమే చెట్టుతొర్రలో దాగిన దుష్టబుద్ధి తండ్రి లోపలనుంచి "బంగారు నాణాలున్న బిందెలను సుబుద్ధి అపహరించాడు" అని సాక్ష్యము చెప్పాడు. తన ఎత్తు పారినదని దుష్టబుద్ధి సంతోషించసాగాడు.

"కాని చెట్లు మాట్లాడటమేమిటి? నమ్మశక్యము కాకుండా వుంది" అని రాజుగారు అక్కడ ఎండుగడ్డిని తొర్రలో వేయించి మంట పెట్టించాడు. ఆ వేడికి పొగకు వూపిరాడక లోపల నక్కికూర్చున్న దుష్టబుద్ధి తండ్రి బిగ్గరగా కేకలు వేస్తూ తొర్రలో నుండి బయటపడ్డాడు.

అప్పుడు రాజుగారు ఆ ముసలివాణ్ని పట్టుకొని సంగతేమిటని ప్రశ్నిం చారు. అతను దుష్టబుద్ధి ద్రోహచింత గురించి రాజుగారికి వివరించి "ఆ బంగారు నాణాలున్నబిందెను దుష్టబుద్ధే అపహరించి తమ ఇంటిలో దాడాడని" చెప్పాడు.

రాజు భటులను పంపి దుష్టబుద్ధి ఇంటినుంచి బంగారు నాణాలున్న బిందె లను తెప్పించి బుసుద్ధికి యిప్పించాడు. మిత్రద్రోహముచేసి దొంగతనానికి అబద్ధా నికి పాల్పడిన దుష్టబుద్ధికి శిక్ష విధించాడు.

పరులకు హాని చేయాలని గోయితీస్తే ఆ గోతిలో మనమే పడతాము. దూర దృష్టి లేకుండా ఎత్తులువేస్తే అవి మనల్నే చిత్తుచేస్తాయి అని ఈ కథ మనకు హెచ్చరిక చేస్తుంది.

మూర్ఖులు

ఈ ప్రపంచములో ముఖ్యముగా మూడురకాల మనుష్యులుంటారు వారు స్వయముగా ఆలోచించగలరు. ఎవరైనా చెప్పితే వినేవారు. ఆలోచించని వారు చెప్పితే విననివారు. వారిని మూర్ఖులంటారు. ఇసుకనుంచి నూనె తీయగలరేమో కాని మూర్ఖులకు చెప్పి ఒప్పించలేము పైగా అలా చెప్పడమువల్ల వారు యెదురు తిరిగి మనకే ఆపద తలపెడతారు.

అటువంటి మూర్ఖుల కథలు తెలుసుకుందాము. ఒక అడవిలోకి కొన్ని హంసలు, తాబేలు స్నేహముగా ఉంటున్నాయి. ఆ తాబేలు పేరు కంబుగ్రీవుడు

చెరువులోనూ చెరువు గట్టుమీద కూడా తిరుగుతూండేది. హంసలు కూడా చెరువులో ఈదుకుంటూ తామరకాడలు తిని, తీరికవేళల్లో గట్టుమీద గంతులు వేస్తుండేవి. ఇలా చాలాకాలం గడిచింది.

ఒకసారి ఆ ప్రాంతంలో తీవ్రమైన దుర్భిక్షం ఏర్పడింది. చెరువు ఎండిపోసాగింది. అప్పుడు హంసలు ఆ చెరువును వదలిపోవాలనుకున్నాయి. తాబేలును కూడా తమతో తీసుకువెళ్ళాలనుకున్నాయి. నేలమీద పాకివస్తే చాలా రోజులు పడుతుంది. పైగా ప్రమాదము కూడా. అందుకని ఒక ఉపాయము ఆలోచించాయి.

తామిద్దరూ ఒక కర్రపుల్లను అటు ఇటు ముక్కునకరచి పట్టుకుంటామని మధ్యన తాబేలు ఆ కర్రను నోటితో పట్టుకోవాలని అప్పుడు ఆకాశమార్గాన ఎగిరి వెళ్ళిపోవచ్చునని అవి తాబేలుకు చెప్పాయి. తాబేలు అందుకు అంగీకరించింది.

బయలుదేరే ముందు హంసలు తాబేలును యిలా హెచ్చరించాయి "మిత్రమా! మార్గములో పల్లెలు, పట్టణాలు వస్తాయి. ఆకాశములో వెళుతున్న మనల్నిచూసి క్రింద జనము కేకలు వేస్తారు తప్పట్లు కొడతారు నువ్వు మాత్రము నోరు తెరవవద్దు, అలా తెరిస్తే క్రిందపడి చచ్చిపోతావు."

మిత్రుల హెచ్చరికను విన్న తాబేలు అలాగే అని చెప్పి కర్రపుల్ల మధ్యభాగాన నోటితో పట్టుకుంది. హంసలు రెండు అటు ఇటు ఆ పుల్లను తన ముక్కులతో కరుచుకొని ఆకాశానికి ఎగిరాయి. అవి రివ్వున ఎగిరిపోతుంటే తాబేలుకి క్రింద చెట్లు, చేమలు, ఇళ్ళు, సెలయేళ్ళు తమాషాగా కనిపిస్తున్నాయి.

అలా పయనించి, పయనించి ఒక పట్నముమీదుగా ఎగురుతున్నాయి. ఆ నగరములోని పిల్లలు ఆకాశమువైపు చూసి "ఎంత విచిత్రము! తాబేలు ఆకాశములో ఎగురుతుంది" అని బిగ్గరగా కేకలువేస్తూ గోలచేయసాగారు.

తాబేలుకు ఆత్రము పెరిగింది. ఆ పిల్లలు ఏమని అంటున్నారో తెలుసుకోవాలనుకుంది. ఆ తొందరలో హంసలు చెప్పినసంగతి మరిచిపోయింది. "వాళ్ళేమిటనుకున్నారు" అని అడగాలని నోరు తెరవగానే నేలమీద పడిపోయి

మరణించింది. ఇది మూర్ఖత్వము కాక మరేమిటి? ఇక్కడ తాబేలు తన మూర్ఖత్వము వల్ల మరణించింది కాని మూర్ఖులైన కోతులకు సలహాచెప్పి వాటి చేతుల్లో చచ్చి పోయిన పక్షి ఒకటి వుంది.



దాని పేరు సూచీముఖము. అది చిన్న పిట్ట. చాలా తెలివైనది. అడవి పళ్ళు ఫలాలుతిని హాయిగా జీవిస్తోంది. అది వుంటున్నచోటే ఒక చెట్టుపై కొన్ని కోతులు ఉంటున్నాయి.

అది చలికాలం. కోతులకు చలి కావాలనిపించింది- అయితే వాటికినిప్పంటే ఏమిటో తెలియదు. కాని మంటవల్ల వేడివస్తుందని దానితో చలి కాగవచ్చునని వాటికి తెలుసు.

అందుకని అవి ఆ చుట్టుప్రక్కల తిరుగుతున్న మిణుగురు పురుగుల్ని తెచ్చి ఒకచోట గుట్టగాపోసి చుట్టూచేరి చలికాగుతున్నట్టు కూర్చున్నాయి.

వాటి అమాయకత్వానికి నవ్వుకుని సూచీముఖుడు అక్కడకువచ్చి కిచకిచలాడి ఇలా అన్నాడు:

"మిత్రులారా! అవి మిణుగురు పురుగులు. మంటలు కావు. వాటివల్ల మీ చలి తీరదు. వెళ్ళి కట్టెపుల్లలు తెచ్చి వెలిగించుకోండి మంచి మంట వచ్చి మీ చలి పోతుంది.

తాము అడగకుండా సలహా ఇస్తున్న సూచిముఖుని చూసి కోతులు కోపగించి దానికి ఏమీ తెలియదని నిందించి, తమకే అన్నీ తెలుసునని దానిమెడ పట్టుకొని చంపేశాయి.

కనుక మూర్ఖులకు మంచి చెప్పడం కూడా ప్రమాదమే అని ఈ కథ చెబుతుంది.

మూడు చేపలు

మూర్ఖత్వంతో మరణించిన ఒక చేప కథ ఇది. ఒక చెరువులో మూడు చేపలు స్నేహంగా ఉంటున్నాయి. వాటిపేర్లు దూరదర్శి, కుశాగ్రబుద్ధి, మందబుద్ధి, దూరదర్శి పేరుకు తగినట్లు మంచిచెడ్డలను ముందుగానే ఊహించి తగిన నిర్ణయాలు తీసుకొన్నది. మందబుద్ధికి తెలివిలేదు. అలా అని ఎవరు చెప్పినా వినదు. తనకు తోచినదే వేదం అనే మూర్ఖత్వం ఆ చేపది.

ఇలా ఉండగా ఒకనాడు దూరదర్శి హడావుడిగా వచ్చి స్నేహితులు యిద్దరికీ ఇలా హెచ్చరిక చేసింది.

"మిత్రులారా! మనకు ఆపద వచ్చింది. రేపు ఈ చెరువులో వలలువేసి చేపలు అన్నింటినీ పట్టుకోవాలని జాలర్లు ఆ ఒడ్డున నిలబడి అనుకొంటుండగా నేను విన్నాను. మనం ఈ రోజే ఎక్కడికైనా వెళ్ళిపోయి ప్రాణాలు రక్షించుకొందాం.

కుశాగ్రబుద్ధి, మందబుద్ధి దాని మాటలు వినలేదు. పైగా దూరదర్శి అబద్దాలు చెపుతున్నదని నిందించాయి. దూరదర్శి "వాటి ఖర్మానికి" వాటిని వదలి వేరే చెరువులోకి వెళ్ళిపోయింది.

మరునాడు జాలరు వచ్చారు. వలపన్నారు. కుశాగ్రబుద్ధి, మందబుద్ధి వలలో చిక్కుకున్నారు. తమ స్నేహితుడు చెప్పిన మాట వినలేదని కుశాగ్రబుద్ధి చాలా దుఃఖించాడు. అయినా ఉపాయం ఆలోచించాడు.

వలల్ని లాగి చేపల్ని గట్టున వేశారు జాలర్లు. అప్పుడు కుశాగ్రబుద్ధి ఊపిరి బిగబట్టి చచ్చిపోయినట్లు పడివుంది. వలలో చచ్చిపోయిన చేపల్ని జాలర్లు ప్రక్కన పేరవేశారు కొనప్రాణంతో గిలగిలలాడుతున్న చేపల్ని మాత్రం బుట్టలలో వేసుకొన్నారు. ఏ ఉపాయం తెలియని మందబుద్ధి చేప జాలర్లకు చిక్కి చచ్చి పోయింది.

గట్టునపడిన చేపలలో ఊపిరి బిగబట్టిన కుశాగ్రబుద్ధి మాత్రం సమయం చూసి ఒక్కగెంతు నీళ్ళలోకి దూకి ప్రాణాలు కాపాడుకుంది.

స్నేహితుల మాట వినక మూర్ఖత్వంతో ఉంటే ప్రాణాలు పోతాయి అని హెచ్చరిక చేసే నీతి కథ ఇది.

భయం మంచిది కాదు

భయం మంచిదికాదు. పిరికివాడు ఈలోకంలో దేనినీ సాధించలేడు ధైర్యంవల్లనే యే పనైనా సానుకూలం అవుతుంది. మంచి ఫలితాలు వస్తాయి! చిన్న శబ్దంవిని భయపడితే పెద్ద పెద్ద రాచకార్యాలు ఎలా సాధించగలం.

సంజీవకుడు అరణ్యంలో యెక్కడో దూరంగా వేసిన రంకె విని పింగళ సింహరాజు భయపడినప్పుడు కరటక, దమనకులు కొన్ని మాటలుచెప్పి రాజుకి ధైర్యం కలిగించారు. పైగా ఒక మంచి కథ చెప్పారు. అదే "నక్క-భేరి" కథ.

అడవిలో ఒక నక్క ఉండేది. దానికి రకరకాల మాంసములు తినడం అంటే మహా ఇష్టం. తెలివిగా ఆయా మాంసాలు తింటూండేది. నక్క స్వయంగ పెద్ద జంతువుల్ని వేటాడలేదు! అందుచేత ఏ సింహమో, పెద్దపులో వేటాడి తిని వదిలేసిన మాంసాన్ని తింటుంది. అలాగే రకరకాల జంతువుల మాంసాలను తినేది ఐనా ఏనాడు పులి యెదుటకాని, సింహం యెదుటకాని పడలేదు. అవంటే దానికి భయం. అలా నక్క కాలం వెళ్ళబుచ్చుతోంది.

ఒకసారి ఆ అరణ్యం దగ్గరలో పెద్ద యుద్ధం జరిగింది. ఎన్నో గుర్రాలు, ఏనుగులు యుద్ధంలో చచ్చిపోయాయి. ఎందరో మనుష్యులు నేలకూలారు. రక్తం ఏరులై ప్రవహించింది. మాంసం ముక్కలు ఆ యేటిలో తేలియాడుతున్నాయి. యుద్ధం అయిపోయింది. సైన్యాలు వెళ్ళిపోయాయి. అంతా నిశ్శబ్దం పీనుగు పెంటలు దుర్వాసనలు మాంసం కుళ్ళుతున్న చెత్తవాసన! రక్తం గడ్డకట్టిన చమ్మ వాసన.

నక్కకు ఆ వాసన ఆనందప్రదమైంది. ఏనుగులు మాంసం, గుర్రాల మాంసం, మనుష్యుల మాంసం రక్తపుగడ్డలు హాయిగా తినవచ్చని సంబరపడింది. తీరికగా ఆ ప్రాంతానికి వచ్చింది. అక్కడంతా భయంకర దృశ్యం! చెట్ల మధ్య మానవ కళేబరాలు, పశువులు, అస్థిపంజరములు నెత్తుటి మడుగులు.

ఇంతలో దానికి "గర గర" అనే శబ్దం భయంకరంగా వినిపించింది. అదేదో క్రూరజంతువు కోపంగా అరిచినట్లు భయపడింది. నక్క ఒకకొండ ప్రక్క దాగి కొంతసేపు చూచింది. శబ్దము వినిపిస్తుంది. కాని యెవ్వరూ కనిపించడంలేదు. యే జంతువు అటుగారాలేదు.

భయపడితే తన కోరిక తీరదని నక్క నెమ్మదిగా అటు రాసాగింది. అటు యిటు చూస్తుంది. ఏ శత్రు జంతువైనా తనపైదూకి, ప్రాణాలుతీయకుండా అతి జాగ్రత్తగా నడవసాగింది ఆ ధ్వని మరీ ఎక్కువగా "గర్! గర్" మని వినిపిస్తోంది. నక్క ఈసారి ఒక చెట్టుచాటున నిలబడి గుట్టూ చూసింది. మనుష్య సంచారంలేదు. జంతువుల అలికిడిలేదు. మరి ఈ ధ్వని ఎచటనుంచి వస్తుంది. దానికి అంతుపట్టటంలేదు. బాగా ఆలోచించింది వెదురు పొదలు ఉన్నాయేమోనని చూసింది. అక్కడ అటువంటి పొదలులేవు.

వెదురు బొంగులకు తుమ్మెదల రంధ్రాలు చేస్తాయి. ఆ చిల్లులోనికి గాలి ప్రసరించినపుడు సన్నని శబ్దం వస్తుంది. కాని అక్కడ అటువంటి వెదురు డొంకలు ఏమీలేవు. కనుక అది వాటి ధ్వనికాని మరి ఈ ధ్వని ఎచట నుండి వస్తోంది.

నక్కకు భయంపోయింది. ధైర్యం తెచ్చుకొన్నది. వేగంగా ముందుకు వెళ్ళి చూచింది. అక్కడ క చెట్టుక్రింద పెద్ద యుద్ధభేరి ఉంది. ఆ చెట్టుకొమ్మ ఒకటి దానికి రాసుకొని గాలి వీచినపుడు అటు కదలి, "గుర్‌గర్ర్!" అని ధ్వని వస్తున్నది.

నక్కకు అసలు రహస్యం తెలిసిపోయింది. పూర్తిగా భయంపోయింది ఇంతసేపూ అనవసరంగా భయపడిన తన అజ్ఞానాన్ని నిందించుకొన్నది. ఇక జాగు చేయక మాంసం సేవించాలని దూకబోయి ఆగింది. తోలుసు తిని ఆపై అక్కడి

మాంసం తినవలెనని అనుకొంది. ఆ ప్రకారమే ఆ నక్క ముందుగా ఆ భేరికి అతికిన చర్మంనంతను ఆరగించి ఆపై అచటి మాంసంని నెత్తుటి గడ్డలను చాలా రోజులపాటు తింటూవుంది.

ఈ కథ చెప్పి కరటక, దమనకులు తమరాజైన పింగళకునకు ధైర్యం ఉపదేశించాయి. "ఎవరైనప్పటికీ భయంవల్ల నష్టపోతారు. ధైర్యంవల్ల లాభంపొందుతారు!" ఇది ఈ కథ నీతి.

డిండిమము

లోకంలో ఎవరికైనా సరే యుపకారం చేయడం ఉత్తమముల లక్షణం. అటువంటివారు తమకు అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేస్తారు. కాని పాత్రత ఎరిగి దానము చేయాలి. అలాగే బుద్ధి తెలుసుకొని ఉపకారం చేయాలి. అల్పబుద్ధివానికి ఆకతాయికి ఉపకారం చేయడం మంచిదికాదు. అలా చేసినట్లయితే ప్రాణాంతకమే అవుతుంది. మనవల్ల ఉపకారం పొందినవారు మనకే కీడు చేస్తారు. ఈ నీతిని బోధించే కథ ఇది.

మందవిసర్పిణి అనే పేరుగల పేను ఒకటి ఉండేది. అది ఒక రాజుగారి పాన్పును ఆశ్రయించి పగటిపూట పరుపుక్రిందనో, తలగడక్రిందనో దాగి వుండి రాత్రి కాగానే బయటికి వచ్చేది. రాజుగారు గాఢంగా నిద్రపోయారని గ్రహించిన తర్వాత నెమ్మదిగా ఆయన గెడ్డంలో మూరి నొప్పి తెలియకుండా రక్తం త్రాగి కడుపు నింపుకొని వెళ్ళిపోయేది.

ఏ ఆటంకమూ, ప్రాణభయమూ లేకుండా ఆ పేను కాలం గడుపుతోంది. ఒకసారి ఆ మంచంపైకి నల్లి ఒకటి వచ్చింది దానిపేరు డిండిమము. అది బాగా బలిసి, పొతకవలె వున్నది. దానిని చూసి మందవిస్పరిణి ఇలా అడిగినది.

"నీ పేరేమిటి? ఎచట నుండి ఇచటకు వచ్చితివి?"

అప్పుడు ఆ నల్లి "నా పేరు డిండిమము. ఇంతకాలము నేను పేదల గుడిసెలలో వున్నాను. రాజుగారి రక్తం రుచిగా వుంటుందని విన్నాను. రుచి చూడాలని యిలా వచ్చాను. రాజనాల వరిబియ్యం, సుగంధ ద్రవ్యములు వేసిన వంటకాలు మధుర ఫలములు భుజించే రాజావారి రక్తం చాలా బాగుంటుందికదా! నన్ను నీ స్నేహితురాలిగా భావించి ఆశ్రయం యియ్యి" అని కోరింది.

అమాయకురాలైన పేను "సరే! ఉండు నా సొమ్మేమిపోయింది. నేను గడ్డంలో మారి రక్తపానం చేస్తా. నీవు మరోచోట రక్తాన్ని త్రాగు, నేటి నుంచి మనం మిత్రులం" అన్నది.

అప్పటినుండి మందవిస్సరిణి, డిండిమము స్నేహంగా వుండి రాజావారి ఒంటి రక్తమును విందారగించసాగాయి.

ఒకనాడు రాజావారు ఇంకా నిద్రపోలేదు. ఊరకనే పండుకొనినారు. ఆ సంగతిని గుర్తించక ఆయన నిద్రపోయారనుకొని డిండిమము మంచం క్రిందనుంచి పరుపుపైకి ప్రాకి రాజావారి నడ్డిక్రిందజేరి పుటుక్కున ఆయనను కుట్టి నెత్తురు త్రాగసాగింది మెలకువగావున్న రాజుగారు తటాలునలేచి భటులను పిలచి ప్రక్క దులిపివేయుడని తటాలున ఆజ్ఞాపించాడు.

భటులు లాంతరు తెచ్చేలోపల నల్లి చకచక సాగి మంచంక్రింద దాక్కున్నది. సంగతి తెలియక పేను మాత్రము తలగడ క్రింద వుండిపోయింది.

భటులు దీపం తెచ్చి ప్రక్క దులిపారు. తలగడ క్రిందగల పేనును చూశారు. అదే రాజావారిని కుట్టి ఆయన నిద్రకు భంగం కలుగజేసిందని భావించి వారా పేనును చంపేశారు.

అల్పబుద్ధివాడైన డిండిమమునకు ఉపకారముచేసి మంచి విసర్పిణి ప్రాణాలు పోగొట్టుకొన్నది.

పెద్దవారితో స్నేహం

స్నేహం అనేక రకాలు. తాత్కాలిక స్నేహం, శాశ్వత స్నేహం, దొడ్డ వారితో స్నేహం, మంచివారితో స్నేహం! అల్పులతో స్నేహం, విజ్ఞులతో స్నేహం ఇలా మిత్రత్వం అనేక విధాలుగా వుంటుంది. ఒక అవసరం తీర్చుకొనడానికి అప్పటికప్పుడు చేసే స్నేహ్నం తాత్కాలిక స్నేహం. యుద్ధ సమయాలలో రాజులు ఇలాంటి స్నేహాలు చేస్తుంటారు. ఆపద వచ్చినపుడు కూడా ఆ మనిషి ఆ గండాన్ని గట్టెక్కడానికై కొందరితో తాత్కాలిక మైత్రి నెరపుతుంటాడు.

అలాకాక కష్ట సుఖాలలో ఆపద ఆనంద సమయాలలో కలసి వుండే స్నేహం శాశ్వత స్నేహం. కృష్ణ కుచేలుర స్నేహం అటువంటిదే. ఈ స్నేహానికి సంపదతో అధికారంతో పనిలేదు.

ఐతే ఒక్కొక్కసారి దొడ్డవారితో స్నేహం అవసరమవుతుంది. వారు సంపదలు గలవారు కావచ్చు! అధికారం గలవారు కావచ్చు! బలవంతులుకావచ్చు! సుగ్రీవుడు వాలిని చంపించడానికై దొడ్డవాడైన రాముని స్నేహాన్ని సమయాన్ని పొందాడు. అలాగే చెడ్డవారితో స్నేహం. రావణాసురుడు దుర్బుద్ధితో సీతను అపహరించాలని మారీచుని సహాయం కోరెను. ఐతే చెడ్డవారితో చెలిమి ఉభయులకు కష్టకారకమే అవుతుంది. అలాగే అల్పులతో చెలిమి కూడా ఎన్నో కష్టాలను తెచ్చి పెడుతుంది.

దొడ్డవారితో, విజ్ఞులతో చెలిమిచేయడం అన్ని విధాల మంచిది. శ్రీరామునితో చెలిమిచేసిన సుగ్రీవుడు, శ్రీకృష్ణునితో చెలిమి చేసిన పాండవులు ఎంతో లాభం పొందారు. చాలా సుఖం పొందారు. గనుక దొడ్డవారితో చెలిమి చేయాలి. ఇందుకు చక్కటి ఉదాహరణ ఈ కథ.

ఒక పెద్ద సముద్రం వుంది. ఆ సముద్ర వొడ్డున ఒక చెట్టు వున్నది. ఆ చెట్టుపై తీతువుల జంట గూడుగట్టుకొని కాపురం వుంటున్నాయి. కొన్ని రోజులకు ఆడతీతువు గర్భము ధరించింది. గ్రుడ్లు పెట్టింది. అవి పిల్లలైతే తమ సంతతి వృద్ధి చెందుతుందని అవి ఆనందించాయి.

ఐతే యీలోగా సముద్రములో కెరటాలు తాటి చెట్టంత యెత్తు లేచాయి. తీతువు పిట్టలు గాలిలోకి ఎగిరి ప్రాణాలు కాపాడుకొన్నాయి. కాని ముచ్చటగా కట్టుకొన్న గూడు ప్రాణప్రదంగా చూసుకొంటున్న గూటిలోని గ్రుడ్లు సముద్ర కెరటాలలా కొట్టుకొనిపోయాయి. తీతువు దంపతులు యెంతో బాధపడ్డాయి.

కొన్నాళ్ళకు వాటి దుఃఖం క్రమంగా తగ్గింది. మరల కొత్త గూడు కట్టాయి, ఆడతీతువు మరల గర్భవతయింది. గ్రుడ్లను పెట్టింది. మరల సముద్రుడు చెట్టంత యెత్తున పొంగాడు గూడు, గ్రుడ్లు కొట్టుకొనిపోయాయి.

తీతువు దంపతులు యెంతో విలపించాయి. మరల గూడుకట్టాయి. ఆడ తీతువు మరల గ్రుడ్లుపెట్టింది. సముద్రుడు పొంగాడు. ఆ గూడు వాటి గ్రుడ్లు కొట్టుకుపోయాయి. ఆడతీతువు దుఃఖానికి అంతులేదు.

అప్పుడు మగతీతువు కోపగించి సముద్రుడితో ఇలా అన్నాడు.

"ఓ సముద్రుడా! మేము చిన్న పక్షులమని నువ్వు మాపై విరుచుకు పడుతున్నావు. ఇది నీకు ధర్మంకాదు. ఈసారి నా భార్య గ్రుడ్లను పెట్టినప్పుడు నీవు పొంగవలదు జాగ్రత్త! పిల్లలపై సమస్త జీవులకు ప్రేమ ఉంతుంది. ఈ సంగతి నీకు తెలియనిది కాదు."

మగతీతువు మాటలు విని సముద్రుడు పకపక నవ్వాడు. ఆ పక్షి మాటలను అతడు లక్ష్యపెట్టలేదు.

ఆడతీతువు మరల గర్భం ధరించింది. గ్రుడ్లు పెట్టింది. సముద్రుడు ఇదివర కటివలెనే పైకి ఎగసి కెరటాల చేతులతో ఆ గూటిని గ్రుడ్లను తనలోకి లాగుకొన్నాడు.

దీనితో మగతీతువు కోపం పెరిగినది. కాని బలవంతుడైన సముద్రుని తానేమి చేయగలడు? ఏమి చేయలేడు మరి కర్తవ్యము?

మగ తీతువుకు యేమీ చేయడానికి ఉపాయం తోచలేదు. అప్పుడు ఆడ తీతువు మగనితో ఇలా అన్నది.

“మనం చిన్న పక్షులం. సముద్రుడు మన మాట వినడు. మనపై కనికరించడు అని ఊరుకున్నచో జీవితాంతము ఈ గర్భశోకం నాకు తప్పదు. నా శోకం మీకును వేదనయే కద! గనుక మన జాతివాడైన గరుత్మంతుని ప్రార్థిద్దాం ఆయన సహాయాన్ని కోరుదాం. పెద్దవాడు, బలవంతుడు అయిన గరుత్మంతుడు వచ్చి మందలించిన కాని సముద్రుడు శాంతించడు.”

భార్య మాటలకు మగతీతువు సంతోషించినాడు. విష్ణుమూర్తి వాహనమై ముల్లోకాలను నిముషాలలో ఎగిరివచ్చే మహాపరాక్రమవంతుడైన గరుత్మంతుని వారిద్దరూ ప్రార్థించారు.

దయామూర్తి అయిన గరుత్మంతుడు ప్రత్యక్షమయ్యాడు. ఏమి సహాయం కావలెనో అడగమన్నాడు. అప్పుడు తీతువులు ఇలా కోరాయి.

“దేవలోకమునుండి అమృతమును తెచ్చి తల్లి చెర విడిపించిన ఓ గరుత్మంతా! నీకు నమస్కారము. పక్షి కులమునకే పేరు ప్రతిష్ఠలు తెచ్చిన మహా పరాక్రమవంతుడా! చిన్న పక్షులమయిన మాకు నీ సహాయం కావలెను. సముద్రుడు

గర్వంతో హొంగి నా గ్రుడ్లను తీసుకుపోతున్నాడు. నీ పరాక్రమం ప్రదర్శించి మా సంతానమును మాకిచ్చేటట్లు సముద్రునికి చెప్పు. ఇక ఎప్పుడునూ సముద్రుడు మా గూటిపై విరుచుకొని పడకుండా ఆజ్ఞాపించుము. నా గర్భశోకము చల్లార్చుము."

ఆ తీతువు ప్రార్థనను, వేడుకోలును మన్నించి గరుత్మంతుడు సముద్రునిపై కోపగించాడు. "సముద్రా!" అని కేకవేశాడు.

విష్ణుమూర్తి వాహనమయిన గరుత్మంతుడే తనపై ఆగ్రహించిన ప్రమాదకరమని తలచి సముద్రుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు గరుత్మంతుడు సముద్రునితో యిలా అన్నాడు-

"సముద్రా! ఈ తీతువుల గ్రుడ్లను తెచ్చి యిమ్ము, ఇక ఎన్నడూ వాటి బ్రతుకులలో చిచ్చు రగల్చకు. ఇది నా ఆజ్ఞ!"

గరుత్మంతుని ఆజ్ఞ ప్రకారం సముద్రుడు తీతువు గ్రుడ్లు తెచ్చి ఇచ్చాడు ఇక ఎన్నడూ వాటి గూటిని తాకనని, వాటి గ్రుడ్లను అపహరించబోనని ప్రతిజ్ఞ చేసి సముద్రుడు మాయమయ్యెను. తీతువు దంపతులు సంతోషంతో గరుత్మంతునికి కృతజ్ఞతలు తెలిపాయి. వాటిని ఆశీర్వదించి గరుత్మంతుడు మాయమయ్యాడు. నాటి నుంచి ఆ తీతువు దంపతులు హాయిగా జీవించాయి.

పెద్దవారితో చెలిమి కష్టాన్ని తొలగిస్తుంది. దుష్టులవలన కలిగే బాధల్ని నివారిస్తుంది.

వడ్రంగి - సింహం

పెద్దవారితో చెలిమి అనేక విధాల ఉపయోగకరమయినట్లయితే చెడ్డవారితో చెలిమి ఎన్నో రకాలుగా హాని చేకూరుస్తుంది. ఒక్కొక్కసారి మంచి మిత్రుల్ని కూడా దూరం చేస్తుంది. హితైషుల్ని దూరం చేస్తుంది. ఆత్మీయుల్ని దూరం చేస్తుంది చివరకు చేటు తెస్తుంది. అందువలన సర్వవేళలయందు మంచి వారితోనే చెలిమి చేయాలని పెద్దలు పదే పదే గుర్తు చేస్తుంటారు.

అగ్నిదేవుడు ఎంతో శక్తిగలవాడు. ఆయన వాయుదేవునితో చెలిమి చేసినట్లయితే ఇంకా శక్తి పెరిగి ఎంతగానో పెరిగిపోతాడు. ఉజ్వలంగా ప్రకాశిస్తాడు. వేయి నాల్కలతో జ్వాలల్ని రేపగలుగుతాడు. నిమిషాల మీద ఈ ప్రపంచాన్ని భస్మీపటలం చేయగలుగుతాడు.

అలాకాక "నేను అగ్నిని నాకేమిటని" విర్రవీగి నీచుడయిన ఇనుముతో స్నేహంచేస్తే ఏమవుతుంది? కొలిమిలో యినుముతో చేరిన అగ్నిదేవునకు కూడా

సమ్మెట దెబ్బలు తప్పవు. చివరకు నీటిలో మునిగిన ఇనుప ముక్కవలె పరాక్రమం చల్లారిపోక తప్పదు.



గనుక ఎంతటి గొప్పవారయినా అల్పులతో నీచులతో చెలిమి చేయరాదు. సమ ఉజ్జీలతో లేదా అంతకంటే గొప్పవారితో చెలిమి చేయాలి. చెలిమిని పెంచుకోవాలి. లేకుంటే ప్రమాదం. ఇనుము సహవాసము చేసిన అగ్ని చెలిమిని వాయువు కూడా విడిచిపెట్టినట్లే నీచులతో కలిసిన వారిని మంచి మిత్రులు కూడా విడచి పెడతారు. ఈ నీతిని వివరించే చిన్న కథ ఇది.

ఒక వడ్రంగి వుండేవాడు. అతడు కొయ్యసామానును చేయడంలో నేర్పరి. మంచివాడు. రోజూ తన గ్రామంలో కొయ్యసామానులు చేసి అడవి మార్గం గుండా దగ్గరలోని పట్టణానికి వెళ్ళి వాటిని అమ్ముకొనేవాడు. ఆ డబ్బుతో కావలసిన పప్పు, ఉప్పు, బియ్యం, తినుబండారాలు కొనుక్కొని వచ్చేవాడు.

రోజూ అడవిమార్గంలో వెళ్ళే అతనికి ఒక సింహంతో చెలిమి అయింది.

ఇద్దరి స్నేహం బాగా పెరిగింది. వడ్రంగి రోజూ పట్టణం నుంచి వచ్చేటప్పుడు సింహానికి తినుబండారాలు తెచ్చిపెట్టేవాడు. పండుగలకు పబ్బాలకు ఇంటి దగ్గర నుండి పిండివంటలు తెచ్చి తినిపించేవాడు.

ఇలా కాలం గడిచిపోతుంది. వారి చెలిమి బాగా వృద్ధి చెందుతోంది. ఐతే ఈ మధ్యకాలంలో సింహానికి మరి ఇద్దరు స్నేహితులయ్యారు. వారు కాకి, నక్క. అవి కూడా నీచజాతికి చెందినవే. ఐనా సింహం తాను మృగరాజుననీ తనకు ఉత్తమ జాతికి చెందిన మంచి మనిషి నేస్తంగా వున్నాడని గర్వం వుంది. అందుకే వాటితో చెలిమి చేసినా తప్పులేదని భావించి సింహం వాటితో చెలిమి నెరపుతున్నది. తన వడ్రంగి స్నేహితుని గురించి వాటికి వివరించి చెప్పింది.

అవి అతణ్ని తమకు చూపించమని కోరాయి. ఒకనాడు స్నేహితులు ఇద్దర్నీ తీసుకొని సింహం వడ్రంగి వచ్చువేళకు అక్కడ చేరింది. సమయం ప్రకారం వడ్రంగి నెత్తిన తినుబండారాల బుట్టతో వచ్చాడు.

సింహం వెంట నక్క, కాకి వుండడం చూచి వెంటనే చెట్టుపైకి ఎక్కి కూర్చున్నాడు. సింహం ఆశ్చర్యపోయింది. నక్క, కాకి కూడా ఆశ్చర్యపడ్డాయి. రోజూ పిండివంటలతో సింహానికి విందుచేసే వడ్రంగి ఇవాళ తమను చూసి తినుబండారాలతో సహా చెట్టుయెక్కి కూర్చోవడం వింతగా వుంది. అదే మాటను సింహం అడిగింది.

"మిత్రమా! వీరు నా కొత్త స్నేహితులు. నీకూ మిత్రులే! వీరిని చూచి భయపడనక్కరలేదు. చెట్టుదిగిరా. రోజూ నాకు విందుచేసేవాడివి కదా! నేడు వీరందరికీ పసందైన ఫలహారాలు పెట్టు భయమేల రా"

సింహం మాటవిని వడ్రంగి ఇలా అన్నాడు:

"మిత్రమా! నువ్వు సింహానివనీ, మృగాలకు రాజువనీ ఇన్నాళ్ళు నీతో స్నేహం చేశాను. చెలిమి ఉత్తములు ఉన్నతులూ అయినవారితోనే చేయాలి. ఇది పెద్దలమాట. అందుకే జంతువులలో ఉత్తమజాతివాడవనీ అడవికి రాజై ఉన్నత పదవి నధిష్ఠించావనీ నీతో చెలిమితో గడిపాను. కాని నువ్వు నీకన్నా తక్కువ జాతివారైన నక్కతో కాకితో స్నేహం చేశావు. దీనితో ఔన్నత్యం పోయింది. పైగా నక్క జిత్తులమారి లక్షణములు గలది. ఈ కాకి వాడియైన ముక్కుకలది. ఈ నక్క కుటిలోపాయాలతో యేమయినా చేస్తుంది. ఈ కాకి పదునైన తన ముక్కుతో పొడిచి హింసించగలదు. ఇటువంటి దుష్టులతో నువ్వు స్నేహం చేశావు. గనుక యిక నేను నీతో చెలిమిని కొనసాగించను."



వడ్రంగి మాటలకు సిగ్గుపడి సింహం తలవంచుకొని వెళ్ళిపోయింది. ఆ తరువాత నక్క, కాకి వెళ్ళిపోయాయి.

అప్పుడు వడ్రంగి తన బుట్టతో సహా చెట్టుదిగి ఇంటికి వెళ్ళిపోయాడు. సింహం మంచి మానవ మిత్రుని కోల్పోయింది.

ఎంత గొప్పవారైనా సరే నీచులతో స్నేహం చేయరాదని ఈ కథ చెప్పే నీతి.

తాను తీసిన గోతిలో

ఇతరులను మోసగించరాదదు. మిత్రులను అసలే వంచించరాదదు. నమ్మినవారిని మోసగించటం మహాపాపం. మహాపరాధం. ఒకరిని మోసగించాలని గోయి తవ్వితే ఆ గోతిలో మనమే పడతాం. ద్రోహచింతనవల్ల సొంత ప్రయోజనాలకే భంగం కలుగుతుంది. చివరకు పరువుపోతుంది. పలుకుబడి అంతరించిపోతుంది. సంపద సన్నగిల్లిపోతుంది'' అని హెచ్చరించే కథ ఇది.

అది ఒక మహానగరం. ఆ నగరంలో అక్షీణవిభుడనే వ్యాపారి ఉన్నాడు. ఎప్పుడూ వైభవం క్షీణించనివాడని యీ పేరుకు అర్థం. అతని స్నేహితుడొక డున్నాడు. అతని పేరు అయోగ్యమిత్రుడు. అంటే యోగ్యుడైన మిత్రుడుకాడని అర్థం. వారి పేర్లవలెనే వారి స్వభావాలుండేవి. అందుకని వారిని "అన్వర్థ నామ ధేయులు" అనే వారందరూ.

అక్షీణవిభుడు పట్టిందల్లా బంగారమయ్యేది. అతని వైభవం ఎన్నడూ పెరుగుతుండేది. సంపద ఎల్లవేళలా వృద్ధి అవుతుండేది. అయోగ్య మిత్రునికి అంతా వ్యతిరేకంగా వుంది. అతనిని ఎవ్వరూ నమ్మేవారు కారు. వ్యాపారరీత్యా అన్నీ లావాదేవీలు పెట్టేవాడు. అన్నీ ముడులు వేసేవాడు. వాడికి పీడికి కజ్జాలు కలిగించి సంతోషించేవాడు.

ఇద్దరు దెబ్బలాడుకోవడం అతనికి సరదా. ఇద్దరు నష్టపోవడం అతని

పద్ధతి. తానుమాత్రం లబ్ధిని పొందడమతని యుక్తి ఇలా రోజులు గడుస్తున్నాయి.

అక్షీణవిభునికి తన వ్యాపారమును విస్తరింపచేయాలనే బుద్ధి కలిగింది. విదేశాలకు వెళ్ళాలనే ఆలోచన వచ్చింది. దానికి తగిన పథకాన్ని తయారుచేసు కొన్నాడు. ప్రయాణానికి ముందురోజున అతను తన దగ్గరవున్న యాభై బారువుల బంగారాన్ని తీసుకొని అయోగ్యమిత్రుని ఇంటికి వచ్చాడు.

మిత్రునికి సకలవిధ ఉపచారములు చేయించి అయోగ్యమిత్రుడు సంగతి అడిగాడు. అప్పుడు అక్షీణవిభుడు ఇలా అన్నాడు.

"మిత్రమా! విదేశాలకుపోయి వర్తకం చేయదలచాను. నా దగ్గర యాభై బారువుల బంగారం వుంది. నేను విదేశాలనుండి తిరిగివచ్చేవరకూ ఆ బంగారాన్ని నీ దగ్గర దాచు తరువాత తీసుకొంటాను."

మిత్రుని మాటలువిని అయోగ్యమిత్రుడు సంతోషించాడు. చక్కగా వ్యాపారంచేసి లక్షలు ఆర్జించి క్షేమంగా తిరిగిరమ్మని బంగారాన్ని తన దగ్గర జాగ్రత్తగా దాస్తానని అభయం ఇచ్చాడు

అక్షీణవిభుడు మహానందంతో విదేశాలకు వెళ్ళిపోయాడు. ఇక్కడ అయోగ్యమిత్రునికి ఆశ పెరిగింది. బంగారంపై మోజుపడింది. మిత్రుడు తన దగ్గర దాచిన బంగారమును బెండెలనుండి తీసివేశాడు. వేరేచోట దాచుకున్నాడు. ఆ బిందెలకు అక్కడక్కడ చిల్లులు వేశాడు. ఏమీ యెరగనట్లు బెండెల్ని యథా స్థానములో భద్రపరిచినాడు.

కొన్ని సంవత్సరములు గడిచాయి. విదేశాలలో ఎంతో నైపుణ్యంతో వ్యాపారంచేసి లక్షలు సంపాదించి అక్షీణవిభుడు నగరమునకు తిరిగొచ్చాడు అందరితోపాటు అయోగ్యమిత్రుడు కూడా అక్షీణవిభునకు స్వాగత సత్కారములు చేశాడు. కొన్నిరోజులు గడిచాయి.

ఒకనాడు అక్షీణవిభుడు తన స్నేహితుని ఇంటికి వచ్చాడు. ఆ మాటా, ఈమాట అయిన తరువాత తన బంగారమును తెచ్చియిమ్మని అడిగాడు. అప్పు డతను ఇంటిలోకి వెళ్ళి చిల్లులుపడిన బిందెలను తెచ్చి విచారంగా ఇలా అన్నాడు.

"మిత్రమా! ఈ బిందెలకు చిల్లులువేసి ఎలుకలు బంగారం తినేసాయి. ఏమి చేయుదును?"

అక్షీణవిభుడు ఆశ్చర్యపడ్డాడు. "బంగారాన్ని ఎలుకలు తినివేయడమా ఇదెక్కడి వింత? అయోగ్యమిత్రుడే దాన్ని కాజేసి ఎలుకలు తిన్నాయని చెబు

తున్నాడు. సరే! ఈ మోసాన్ని మోసంతోనే తిప్పికొట్టాలి' అని ఆలోచించి మిత్రునితో ఇలా అన్నాడు.



"పోనీలే మిత్రమా! ఎలుకలు తినిన బంగారాన్ని నువ్వు మాత్రం ఎక్కడ నుంచి తెస్తావు! బాధపడకు."

ఈ విధంగా మిత్రుని ఊరడించి అక్షీణవిభుడు ఇంటికి వెళ్ళిపోయాడు. తన ఎత్తు పారిందని అయోగ్యమిత్రుడు నిర్భయంగా సంతోషంగా వున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు అక్షీణవిభుడు స్నేహితుని ఇంటికి వచ్చాడు. అతని కుమారుని చూచి ముద్దాడాడు. బజారుకు తీసుకుపోయి మిఠాయిలు కొనిస్తానన్నాడు. అయోగ్యమిత్రుడు "అలాగే"నని కొడుకును మిత్రునివెంట పంపాడు. అతను ఆ బాలకునితో బజారుకు వెళ్ళాడు.

కొంతసేపైనాక ఒక్కడే మిత్రుని ఇంటికి తిరిగొచ్చాడు. తన పిల్లవాడు యేడని అయోగ్యమిత్రుడు అడిగాడు.

"బజారులో నడుస్తుండగా పిల్లవాడ్ని రాకాసిగద్ద ఎత్తుకుపోయింది. ఏమి చేద్దాం?" అని అక్షీణవిభుడు విచారంగా చెప్పాడు. అప్పుడు అయోగ్యమిత్రుడు కోపగించెను. తన కుమారుని ఏదో చేసి అబద్ధమాడుతున్నాడని భావించి ఈ సంగతి రాజుగారికి ఫిర్యాదు చేశాడు.



రాజు సంగతి విని ఆశ్చర్యపడి అక్షీణవిభునకు కబురు పంపాడు. అతను వచ్చి రాజుకు నమస్కరించాడు.

అప్పుడు రాజు ఇలా అడిగాడు-

"నగరంలో పేరుమోసిన వ్యాపారివి నువ్వు. మిత్రుని కొడుకును అప

హరించి గ్రద్ద ఎత్తుకొనిపోయినదని చెప్పుట న్యాయమా? గ్రద్ద ఎంత? పిల్లవాడెంత? మానవ బాలకుణ్ని పక్షి ఎత్తుకుపోవునా?"

రాజుగారి మాటలు విని అక్షీణవిభుడు "ప్రభూ! బంగారమును ఎలుకలు తింటాయా? అదే నిజమైతే పిల్లవానిని గ్రద్ద ఎత్తుకుపోవడం ఎలా అబద్ధమౌతుంది?" అని ప్రశ్నించాడు.

అప్పుడు రాజు అక్షీణవిభుని ఆ సంగతి వివరించమని అడుగగా అతడు తన బంగారం గురించి అయోగ్యమిత్రుడు సమాధానం తెలియజేశాడు.

అందుకు రాజు ఆశ్చర్యపడి అయోగ్యమిత్రుని మందలించి యాభయ్ బారువల బంగారం తెప్పించి అక్షీణవిభునికి ఇప్పించాడు.

అక్షీణవిభుడు కూడా తాను అంతవరకు తన యింట దాచివుంచిన అతని కొడుకును అప్పగించాడు.

నాటినుంచి అయోగ్యమిత్రుడు ఎవరి ముఖం చూడలేక కృశించాడు. మిత్రుని మోసగించాలని తాను చేసిన గోతిలో తానేపడిన అయోగ్యమిత్రుని కథ వంచకులకు కనువిప్పు కావాలి.

ఈ విధంగా విష్ణుశర్మ మిత్రభేదాన్ని దానిలోని నీతికథలను సుందర్శన మహారాజుగారి కొడుకులకు చెప్పి వారికి కొంతవరకు విజ్ఞత వచ్చేటట్లు చేశాడు.

మిత్రలాభం, మిత్రభేదం ప్రకరణాలను ఆయన జంతువులు ప్రధాన పాత్రలుగా నడిపాడు. మిత్రలాభంలో హిరణ్యకుడు, చిత్రాంగుడు, మథరుడు జంతువులు కాగా లఘుపతనకుడు, చిత్రగ్రీవుడు మాత్రము పక్షులు. పిట్ట కథలలో పక్షులు, జంతువులు కలగా పులగంగా వస్తాయి.

మిత్రభేదంలో కూడా పింగళకుడు, సంజీవకుడు, కరటక దమనకులు జంతువులు. దీనిలో ప్రధాన కథలో పక్షులు రావు. పిట్టకథలలో మాత్రం అవీ ఇవీ వస్తాయి.

ఇలా చెప్పడంలో, విష్ణుశర్మ ఒక చిత్రాన్ని పాటించాడనిపిస్తుంది. పెద్ద జంతువులు జిత్తులమారి పనులలో మంచివైన పక్షుల్ని యిరికించడం సబబు కాదను కొని ఉంటాడాయన. ఉపాయం కథలలో పక్షుల్నే ఎక్కువగా ఉపయోగించాడు.

ఇక "విగ్రహం సంధి" ప్రకరణాలలో ఆయన పక్షుల్నే ప్రధాన పాత్రల్ని చేశాడు. ఈ రకంగా జంతువుల పక్షుల సహజ స్వభావాల్ని తేటతెల్లం చేయడం విష్ణుశర్మ ఆంతర్యం అర్థం అయివుంటుంది.

భలే జంతువులు

పంచతంత్ర కథలలో మనకు ఎన్నో జంతువులు, పక్షులు కనిపిస్తాయి. పలుకరిస్తాయి. ఆ కథలు తెలుసుకొన్నాం. ఇప్పుడు ఆ జంతువుల, పక్షుల గురించి తెలుసుకొందాం.

హిరణ్యకుడు : ఇది ఎలుక. హిరణ్యం అంటే బంగారం. బంగారంవంటి మంచి మనసు వున్నది గనుక దీనికి ఆ పేరు పెట్టాడు.

మంథరుడు : ఇది తాబేలు. మంథరం అంటే ఒక పర్వతం పేరు. కొండవలె గట్టి పెంకు వుంటుంది గనుక దీనికి ఆ పేరు వచ్చింది.

లఘుపతనకుడు : ఇది కాకి. లఘు అంటే చిన్నది అని అర్థం. ఇది చిన్న పక్షి కనుక ఈ పేరు వచ్చింది.

చిత్రగ్రీవుడు : ఇది పావురం. చిత్ర అంటే విచిత్రమైనదని, గ్రీవ అంటే మెడ గలది అని అర్థం. అందుకే దీనికా పేరు పెట్టాడు.

చిత్రాంగుడు : ఇది లేడి. చిత్ర విచిత్రమైన చుక్కలతో వుంటుంది గనుక దీనికా పేరు వచ్చింది.

జరద్గవము : ఇది గ్రద్ద.

దీర్ఘ కర్ణుడు : ఇది పిల్లి. ఎంత దూరములో శబ్దామైనా వినగలదు గనుక యీ పేరు వచ్చింది.

దుష్టబుద్ధి : ఇది కాకి. చెడు స్వభావం గలది.

ఇవి మిత్రలాభం కథలోవచ్చే జంతువులు, పక్షులు ఇక మిత్ర భేదం కథలోకనిపించే జంతువుల. పక్షులవివరం తెలుసుకొందాం.

సంజీవకుడు : ఇది ఎద్దు. చాలా బలం కలది. అందుకే ఈ పేరు.

పింగళకుడు : ఇది సింహం. అడవికి రాజు. మెరుగుపెట్టని బంగారు రంగులో వుంటుంది గనుక ఈ పేరు.

కటకుడు : ఇవి నక్కలు, పింగళకుని మంత్రి కొడుకులు.

దమనకుడు : వక్రబుద్ధి స్వభావంగలవి గనుక ఈ పేర్లు పెట్టాడు.

కాటకుడు, పాటకుడు : ఇవి కూడా నక్కలే. కాటకం అంటే కరవు. ఈ నక్కకు ఎప్పుడూ ఏడుపే. పాటకం అంటే అల్పాత్వం అని అర్థం. ఈ నక్కకు ఎప్పుడు నీచపు ఆలోచనలే. ఇవి పింగళకుని శత్రువులు.

నందకుడు : ఇది సంజీవకుని తోడు ఎద్దు. బలమైనది.

మందవిసర్పిణి : ఇది పేను. నెమ్మదిగా నడిచి రహస్యంగా వుంటుంది.

డిండిమము : ఇది నల్లి.

లొట్టిపిట్ట : వొంటె

టీతువు : ఒక పక్షి. ఇది కూస్తే దుశ్శకునం అంటారు.

దూరదర్శి : ఒక చేప. తెలివైనది.

కుశాగ్రబుద్ధి : ఒక చేప. కొంచెం తెలివున్నది.

మందబుద్ధి : బుద్ధిలేనిది. ఇది ఒక చేప.

సూచీముఖం : ఇది ఒక పక్షి. సూదైన ముఖం కలది కనుక ఈ పేరు.

దుష్టబుద్ధి : ఒక వర్తకుడు. చెడ్డవాడు.

సుబుద్ధి : ఒక వర్తకుడు మంచివాడు.

అయోగ్యమిత్రుడు : యోగ్యుడైన మిత్రుడు కాడు.

అక్షీణవిభుడు : క్షీణించని సంపద కలవాడు.

పేరుపెట్టని కోతులు, పక్షులు ఎన్నో ఈ కథలో వచ్చాయి. వాటికిపేర్లు చెప్పవలసినంత ప్రాధాన్యంలేదు కనుక విష్ణుశర్మ వాటికి నామకరణాలు చేయలేదు.

ఇంతటితోనే ఈ కథలు అయిపోలేదు. "విగ్రహం-సంధి" ప్రకరణాలతో రెండవభాగం వుంది. అది కూడా చదివితేనే యీ కథల అంతరార్థం అంతుపడుతుంది. రెండవభాగం చదవడం మరచిపోకండి.

***